

ఏయూ అధికారులు ఉక్కిరిబిక్కిరి



- సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో అగ్నిప్రమాదం సమాచారం బయటకు రావడంపై ఆందోళన
- రిజిస్ట్రార్ కార్యాలయానికి నివేదిక

- వార్త 6వ పేజీలో

కేజీహెచ్‌లో సేవలపై గరంగరం

ప్రజా ప్రతినిధుల అసంతృప్తి

- రోజుకు కనీసం 10 వేల మందికి ఓపీ సేవలు అందాలి: ఎంపీ ఎం.శ్రీభరత్
- ఆస్పత్రి అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచన



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, చిత్రంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, తదితరులు

- కేజీహెచ్‌కు రావాలంటే రోగులు భయపడుతుంటారు: ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు
- హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటుచేయాలి
- వైద్యులు వ్యాపారాత్మక ఆలోచన వీడి సేవాభావంతో పని చేయాలని సూచించిన ఎమ్మెల్యే పల్లా
- ఆస్పత్రి అభివృద్ధికి సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చిన వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్



సమావేశంలో పాల్గొన్న వైద్యులు

విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర పెద్దాస్పత్రిగా పేరొందిన కేజీహెచ్‌లో రోగులకు అందుతున్న సేవలు, మౌలిక సదుపాయాల పట్ల జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం ఆంధ్ర మెడికల్ కళాశాల లోని సెమినార్ హాలులో వైద్యులు, ఆరోగ్య శాఖ అధికారులతో ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో మాట్లాడిన పలువురు ప్రజాప్రతినిధులు ఆస్పత్రి పనితీరు పట్ల అసహనాన్ని వ్యక్తం చేశారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన కేజీహెచ్‌లో ప్రతిరోజూ కనీసం పది వేల మందికిపైగా ఓపీ (అవుట్ పేషెంట్లు) సేవలు పొందాలని, కొన్నాళ్ల కిందటే ఏర్పాటుచేసిన గీతంలో ఐదు వేల మందికిపైగా ఓపీ సేవలు పొందుతున్నారన్నారు. ఐదు, పదేళ్ల ప్రణాళికలతో అభివృద్ధి పనులు చేయవద్దని, రానున్న 50 ఏళ్లను దృష్టిలో

... మిగతా 6వ పేజీలో

గుప్పుమంటున్న గంజాయి



వీధుల్లోకి చేరిన విక్రయం, వినియోగం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఈనెల 13వ తేదీ రాత్రి చినవాల్తేరులో విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై గంజాయి మత్తులో ఉన్న యువకుడు దాడి చేశాడు. ఈ దాడిలో కానిస్టేబుల్ చేతిఎముక విరిగిపోయింది.

ఈనెల 13న మంగళపాలెం వద్ద దువ్వాడ పోలీసులు ఆర్టీసీ బస్సు తనిఖీ చేస్తుండగా ఒక డిగ్రీ విద్యార్థి బ్యాగ్‌లో రెండు కిలోల గంజాయి ప్యాకెట్ దొరికింది. తన స్నేహితుడి పుట్టిన రోజుకు బహుమతిగా ఇచ్చేందుకు తీసుకువెళుతున్నట్టు చెప్పాడు.

ఈనెల పదో తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత పిఠాపురం కాలనీ లోని ఇళ్లలో దొంగతనం చేస్తుండగా ఒక యువకుడిని స్థానికులు పట్టుకున్నారు. ఆ సమయంలో అతను గంజాయి మత్తులో ఉన్నట్టు గుర్తించి పోలీసులకు అప్పగించారు.



ఇటీవల పెందుర్తిలో పట్టుబడిన గంజాయి

ఆ మత్తులో దాడులు, దొంగతనాలు

- పోలీసులపైనే దాడులకు తెగబడుతుండడంతో నగరవాసుల్లో భయాందోళన
- ఏజెన్సీ నుంచి విచ్చలవిడిగా దిగుమతి
- పుస్తకాల బ్యాగ్‌లలో తెస్తున్న కొంతమంది విద్యార్థులు

నగరంలో గంజాయి వినియోగం కట్టలు తెంచుకుంటోంది. గంజాయి బ్యాచ్ కారణంగా దాడులు, దోపిడీలు, దొంగతనాలు కూడా రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఈనెల 12న ఎనిమిది మంది యువకులు నాలుగు బైక్‌లపై ఎండాడ వైపు వెళ్లి గంజాయి సేవించారు. అర్ధరాత్రి సమయంలో ఎండాడ వద్ద లారీని ఆపి, డ్రైవర్‌ను విచక్షణారహితంగా కొట్టి అతని వద్ద నుంచి సెల్‌ఫోన్, నగదు లాక్కొన్నారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులను పట్టుకున్నారు. అందులో నలుగురైదుగురు బాలురు ఉన్నారు. ఆ మరుసటిరోజే ఆరిలోవలో గంజాయి మత్తులో ఉన్న యువకుడు పానీపూరీ బండి నడుపుకుంటున్న చిరు వ్యాపారిపై దాడి చేశాడు. అలాగే ఈనెల 13వ తేదీ రాత్రి సమయంలో చినవాల్తేరు ప్రాంతంలో త్రీటౌన్ కానిస్టేబుల్ ఎస్.అప్పారావుపై అదే ప్రాంతానికి చెందిన నక్కా భార్గవ్‌రెడ్డి అనే యువకుడు దాడి చేశాడు. కానిస్టేబుల్ చేయి విరిగిపోయింది. ఆ సమయంలో భార్గవ్‌రెడ్డి గంజాయి సేవించి ఉన్నాడని పోలీసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. కొద్దిరోజుల కిందట పిఠాపురం కాలనీలోని ఒక వీధిలో ఒక ఇంటి తర్వాత మరొక ఇంట్లో వరుస చోరీలకు పాల్పడుతున్న డెయిరీ ఫారానికి చెందిన యువకుడిని స్థానికులు పట్టుకున్నారు. ఆ సమయంలో అతడు గంజాయి మత్తులో ఉన్నట్టు గుర్తించి ఎంవీపీ పోలీసులకు అప్పగించారు. ఆ యువకుడితోపాటు మరో ముగ్గురు యువకులు స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు హాజరై అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీలు పాల్పడినట్టు పోలీసులు విచారణలో తేలింది. వీరిలో ఒకరు గతంలో పెట్రోలు, ఇళ్లలో బయట ఉండే వస్తువులతోపాటు ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. వీరంతా గంజాయి సేవించి నేరాలకు పాల్పడుతుంటారని పోలీసులు వెల్లడించారు. కొద్దినెలల కిందట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నడిచివెళుతున్న ఒక మహిళపై గంజాయి మత్తులో ఉన్న కొంతమంది యువకులు అసభ్యంగా ప్రవర్తించారు. ఆ సమయంలో మహిళతోపాటు ఉన్న ఆమె భర్త వారిని ప్రశ్నించడంతో కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వన్‌టౌన్ రెల్లివీధిలో పదో తరగతి చదువుతున్న యువకుడు రాత్రి వేళ తన ఇంట్లోకి అవసరమైన వస్తువులు కొనుగోలు చేసేందుకు కిరాణా దుకాణానికి వెళుతుండగా అక్కడే గంజాయి మత్తులో ఉన్న యువకులు అతన్ని టీజింగ్ చేశారు. ఆ విషయాన్ని బాలుడు తన తండ్రికి చెప్పడంతో అక్కడకు వెళ్లి ప్రశ్నించగా అతనితోపాటు బాలుడిపైనా విచక్షణారహితంగా దాడి చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే నగరంలో గంజాయి గ్యాంగ్ ఆగడాలు ఎన్నో ఉన్నాయి.

విద్యార్థులే కొరియర్లు

ఏజెన్సీ నుంచి గంజాయిని నగరంలోకి తీసుకురావడంలో కొంతమంది విద్యార్థులే కీలకంగా వ్యవహరిస్తున్నారు. బ్యాగుల్లో గంజాయి ప్యాకెట్లు పెట్టుకుని బస్సుల్లో వచ్చేస్తున్నారు. విద్యార్థులు కావడం, వారి వద్ద కాలేజీలకు సంబంధించిన గుర్తింపుకార్డులు, బస్‌పాస్‌లు ఉండడంతో ఎవరికీ అనుమానం రావడం లేదు. ఈనెల 13న మంగళపాలెం వద్ద దువ్వాడ పోలీసులు సబ్బవరం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సును ఆపి తనిఖీ చేశారు. ఆ సమయంలో నగరంలో డిగ్రీ చదువుతున్న చోడవరానికి చెందిన యువకుడి పుస్తకాల బ్యాగ్‌లో రెండు కిలోల గంజాయి ప్యాకెట్ లభ్యమైంది. అతనితోపాటు అతని స్నేహితుడిని పోలీసులు

... మిగతా 6వ పేజీలో

వర్షం...

చల్లబడిన నగరం



బంగాళాఖాతంలో ఉన్న అల్పపీడనం ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి నగరంలో చిరుజల్లులు కురిశాయి. తరువాత మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ పలుచోట్ల ఒక మోస్తరు వర్షం కురిసింది. రానున్న 24 గంటల్లో కూడా నగరంలో వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. - విశాఖపట్నం

బీజేపీ ప్రజా ప్రతినిధులకు అభినందన



అభినందన సభలో ప్రసంగిస్తున్న పురందేశ్వరి. వేదికపై కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, నాయకులు నాగేంద్ర, కాశీవిశ్వనాథరాజు, తదితరులు ఉన్నారు

రాష్ట్రంలో బీజేపీ తరపున ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు సాలిగ్రామపురంలోని పోర్టు సాగరిక ఆడిటోరియంలో సోమవారం రాత్రి అభినందన సభ ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, ఎన్.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. - వివరాలు మెయిన్‌లో

రామావతారంలో జగన్నాథుడు



జగన్నాథస్వామి సోమవారం రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. టర్నర్ చౌల్ట్రీ కల్యాణ మండపంలో కొలువుదీరిన స్వామికి తెల్లవారుజామున మేలుకొలుపు, నిత్యపూజలు, అనంతరం సహస్ర నామార్చన నిర్వహించారు. స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. జగన్నాథునికి రామతీర్థం దేవస్థానం తరపున ఈవో వై.శ్రీనివాసరావు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. జగన్నాథస్వామి ఆలయ ఈవో టి.రాజగోపాలరెడ్డి వారికి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కాగా మంగళవారం జగన్నాథుడు శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. - పూర్ణామార్కెట్

ఉద్యోగాలు పేరుతో...

- జీవీఎంసీ మలేరియా విభాగంలో వసూళ్లు
- రూ.60 వేలు నుంచి రూ.1.2 లక్షల వరకూ...
- చక్రం తిప్పిన శానిటరీ ఇన్‌స్పెక్టర్

విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ మలేరియా విభాగంలో ఉద్యోగాల పేరుతో అదే విభాగంలో పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఒకరు భారీగా వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనివెనుక కొంతమంది అధికారుల పాత్ర ఉండడంతో విషయాన్ని బయటకు రానివ్వకుండా తొక్కిపెట్టారని ప్రజారోగ్యవిభాగంలోని ఉద్యోగులు చెబుతున్నారు. నగరంలో ఏటా వర్షాకాలంలో దోమల నియంత్రణ కోసం సీజనల్ కార్మికులను రోజువారీ కూలీ ప్రాతిపదికన నియమించుకుంటారు. గత ఏడాది జూన్‌లో మలేరియా విభాగంలో తాత్కాలిక ఉద్యోగులుగా 400 మందిని మూడు నెలల కాలపరిమితికి నియమించుకున్నారు. వీరికి పనిచేసిన రోజు రూ.450 చెల్లిస్తారు. దోమల నియంత్రణకు ఫాగింగ్, స్ప్రేయింగ్, లార్వాను గుర్తించి నిర్వీర్యం చేయడం, నీరు నిల్వ ఉంచకుండా ప్రజలకు అవగాహన కల్పించడం వంటి వాటికి వారి సేవలను వినియోగించుకుంటుంటారు. అయితే డెంగ్యూ, మలేరియా కేసులు నమోదవుతుండడంతో ప్రతి మూడు నెలలకు వారి సేవలను పొడిగించుకుంటూ వస్తున్నారు. ఇదిలావుండగా నెల రోజుల కిందట కేజీహెచ్‌లో వైద్య విద్యార్థి ఒకరు డెంగ్యూ బారినపడ్డారు. అతనికి సీరియస్ కావడంతో కలెక్టర్‌తోపాటు జీవీఎంసీ కమిషనర్ కూడా ప్రత్యక్షంగా విద్యార్థిని పరామర్శించారు. కేజీహెచ్‌తోపాటు విక్టోరియా ఆస్పత్రిలో తరచూ డెంగ్యూ కేసులు నమోదవుతుండడంతో ప్రత్యేకంగా దోమల నియంత్రణకు ఒక బృందాన్ని ఏర్పాటుచేయాలని జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేసి ఇటీవల బదిలీ అయిన సాయికాంత్‌వర్మ

... మిగతా 6వ పేజీలో

దుకాణాలతో దందా

రోడ్డుపక్క మార్జిన్లు, ఫుట్‌పాత్‌లపై ఎడాపెడా ఏర్పాటు

- చోటా నేతల వ్యాపారం
- సెంటర్, విస్తీర్ణాన్ని బట్టి రూ.3 లక్షల నుంచి రూ.6 లక్షలకు విక్రయం
- అద్దెకు ఇచ్చుకుంటున్న మరికొందరు...
- ఇలాంటి వారిలో వార్డు స్థాయి వైసీపీ నేతలే ఎక్కువ
- దుకాణాలకు టూలెట్ బోర్డులు
- చోద్యంచూస్తున్న జీవీఎంసీ అధికారులు



రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన బడ్డీకి టూలెట్ బోర్డు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో ప్రధాన రహదారుల మార్జిన్లలో, ఫుట్‌పాత్‌లపై దుకాణాలు పెరిగిపోతున్నాయి. కొందరు జీవనోపాధి కోసం ఏర్పాటుచేసుకుంటుండగా...రాజకీయ పలుకుబడి కలిగిన కొందరు మాత్రం దుకాణాలు పెట్టి అమ్ముకోవడం లేదా అద్దెకు ఇచ్చుకోవడం చేస్తున్నారు. ఇంతవరకూ దుకాణాలను గుట్టుగా అద్దెకిస్తూ వచ్చిన వీరు ఇప్పుడు ఏకంగా టులెట్ బోర్డులు పెడుతున్నారు.

నగరంలో ప్రధానరోడ్లు, కూడళ్లతోపాటు ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీలపై వార్డు స్థాయి నేతలు కొందరు దుకాణాలను ఏర్పాటుచేస్తున్నారు. నగరం రోజురోజుకీ విస్తరిస్తుండడం, ఉపాధి అవకాశాల కోసం వచ్చేవారి సంఖ్య పెరుగుతుండడంతో టిఫిన్ దుకాణాలు, పానీపూరీ, చాట్, పకోడి, కూరగాయలు, డెయిరీ ఉత్పత్తులకు డిమాండ్ కూడా పెరుగుతోంది. ఇదే అవకాశంగా ప్రజా ప్రతినిధుల అనుచరులుగా చలామణీ అయ్యే కొందరు చోటా లీడర్లు తమ ప్రాంతంలోని ప్రధానరోడ్లు, కూడళ్ల వద్ద దుకాణాలు ఏర్పాటుచేసి, వాటిని అవసరమైన వారికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. తమ పలుకుబడిని ఉపయోగించి విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుచేస్తున్నారు. రేకులతో ఏర్పాటుచేసే ఆరు అడుగులు వెడల్పు, ఆరు అడుగులు పొడవు ఉండే ఒక్కో దుకాణాన్ని రూ.మూడు లక్షలకు విక్రయిస్తున్నారు. అదే డిమాండ్ ఉన్న ప్రాంతాలైతే రూ.ఆరు లక్షల వరకూ తీసుకుంటున్నారు. మరికొందరు ఒకేసారి విక్రయించడం కంటే నెలవారీ అద్దెలకు ఇచ్చుకుంటే అదొక స్థిరమైన ఆదాయమార్గంగా ఉంటుందని భావించి నెలకు రూ.మూడు వేల నుంచి ప్రాంతాన్ని బట్టి రూ.పది వేలు వరకూ వసూలు చేస్తున్నారు. ఇలాంటి వారిలో వైసీపీకి చెందిన చోటా నేతలే ఎక్కువగా ఉండడం విశేషం. వైసీపీ ఐదేళ్ల పాలనలో కొందరు వార్డు స్థాయి నేతలు, కార్పొరేటర్లు పలువురు రోడ్డుపక్కన విచ్చలవిడిగా దుకాణాలను ఏర్పాటుచేయించి ఒక రకమైన దందాను

... మిగతా 6వ పేజీలో

గాజువాకలో హత్య



హత్యకు గురయిన వేమిరెడ్డి అప్పలనాయుడు (ఫైల్ ఫొటో)

- హతుడు మాజీ సైనికుడు
- నిందితులు లొంగుబాటు
- స్థల వివాదమే కారణం

గాజువాక, జూలై 15: గాజువాక జగ్గు జంక్షన్ సమీపంలో సోమవారం రాత్రి మాజీ సైనికుడు హత్యకు గురయ్యారు. స్థల వివాదమే ఇందుకు కారణంగా పోలీసులు చెబుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. పాత కర్నవానిపాలేనికి చెందిన మాజీ సైనికుడు వేమిరెడ్డి అప్పలనాయుడు (48)ను అదే ప్రాంతవాసులు బంకా రాము, బంకా అశోక్‌లు కొబ్బరి బొండాల కత్తితో జగ్గు జంక్షన్ సమీపంలో గల శ్రీకృష్ణనగర్ రోడ్డులో అతి కిరాతకంగా నరికి చంపారు. అనంతరం నిందితులు గాజువాక పోలీసులకు లొంగిపోయారు. ఆర్మీలో పదవీ విరమణ అనంతరం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న అప్పలనాయుడుకు, రాము, అశోక్‌ల మధ్య చినగంట్యాడ ప్రాంతంలో ఉన్న 148 గజాల స్థలంపై కొద్దిరోజులుగా వివాదం

... మిగతా 6వ పేజీలో

బీమా ప్రీమియంపై జీఎస్టీ ఎత్తివేతకు చొరవ చూపాలి



ఎంపీ భరత్‌కు వినతి పత్రమిస్తున్న ఐసీఈయూ నాయకులు

డాబాగార్డెన్స్, జూలై 15: ఇన్సూరెన్స్ రంగంలో ఓపీఓ పెంపును విరమించి బీమా ప్రీమియంపై జీఎస్టీ ఎత్తివేసేలా ప్రభుత్వంతో చర్చించాలని ఎంపీ శ్రీభరత్‌ను ఐసీఈయూ విశాఖపట్నం డివిజన్ నాయకులు కోరారు. సోమవారం ఎంపీ భరత్‌ను కలిసి బీమా పరిశ్రమకు సంబంధించిన సమస్యలపై ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖ నాయకులు మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ ఇన్సూరెన్స్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను రానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశంలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీఈయూ జనరల్ సెక్రటరీ జి.వరప్రసాద్, ఏపీ కన్వీనర్ జి. సూర్యప్రభ, నాయకులు సతీష్, గోవింద్, శ్రీనివాసరావు, ఎ.వి.ఆర్.కె. మూర్తి, మీడియా ఇన్‌చార్జి ఎ.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణకు పవన్‌కల్యాణ్ సన్మానం



సన్మానిస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్, జూలై 15: విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన వంశీకృష్ణ శ్రీనివాస్ ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం కేంద్ర కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో పాటు విశాఖ నగర పరిధిలో కూటమి ఎమ్మెల్యేలు విజయంలో తనవంతు పాత్ర పోషించినందుకు వంశీకృష్ణను ప్రశంసించారు.



మాట్లాడుతున్న తెలుగు మహిళలు



పోస్టర్ ఆవిష్కరణలో కార్పొరేటర్ , అధికారులు

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

సీతమ్మధార, జూలై 15: పరిసరాల శుభ్రతపై 14వ వార్డులో మహిళలు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మహిళ నాయకురాలు హేమ ఆధ్వర్యంలో సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్ వద్ద నుంచి ఈమేరకు ర్యాలీ నిర్వహించారు.అతిసార, డెంగ్యూ మలేరియా వ్యాధులపై జాగ్రత్త వహించాలని సూచించారు.ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీవో సీహెచ్ లక్ష్మి, ఆర్‌పీ బి.వరలక్ష్మి, గాయత్రి, జి.వరలక్ష్మి, గౌరి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దోమల నివారణపై దృష్టి సారించాలి

జగదాంబ కూడలి: దోమల నియంత్రణపై ఒక్కరు శ్రద్ధ వహించాలని గ్రేటర్ 35 వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పేర్కొన్నారు. సోమవారం పూర్ణామార్కెట్ వెలంపేట ప్రాథమిక పాఠశాలలో జరిగిన డెంగ్యూ వ్యతిరేక వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కె.వి.ఎస్. కుమార్, మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, జి.రమాదేవి, హెచ్‌ఎం రవికుమార్, విద్యార్థులు తల్లిదండ్రులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రులకు గజమాలతో సత్కారం

అక్కయ్యపాలెం, జూలై 15: విశాఖకు విచ్చేసిన కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌లకు నిరుద్యోగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి పీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో గజమాలతో సోమవారం ఘనస్వాగతం పలికారు. విశాఖను దేశంలో ప్రధాన నాలుగు నగరాల్లో ఒకటిగా ఎంపిక చేసి అభివృద్ధి చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ విశాఖకు విచ్చేసిన మంత్రులతోపాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు డైమండ్ పార్కువద్ద గజమాలతో సత్కరించారు. అనంతరం హేమంతకుమార్, కృష్ణారావు మాట్లాడుతూ త్వరలోనే విశాఖకు రైల్వేజోన్ కేటాయించాలన్నారు. దీనివల్ల ఎంతో మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు.

చదువుతోపాటు క్రీడలను ఛాలెంజింగ్‌గా తీసుకోవాలి

» సన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశాజాస్తి



ఏపీఎల్ విజేతకు రూ. లక్ష చెక్కు అందిస్తున్న ఆశాజాస్తి

డాబాగార్డెన్స్, జూలై 15: చదువుతోపాటు క్రీడలనూ నేటి యువతరం ఛాలెంజింగ్‌గా తీసుకోవాలని సన్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశాజాస్తి పేర్కొన్నారు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-3 (2024) విజేతగా నిలిచిన ఆరెంజ్ క్యాప్, పర్పుల్ క్యాప్ విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. ఆరెంజ్ క్యాప్ విన్నర్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ టోర్నమెంట్ అశ్విన్ హెబ్బర్, పర్పుల్ క్యాప్ విన్నర్ సుదర్శన్ కొదవండ్లకు రూ.లక్ష చొప్పున బహుమతి ఇనిస్టిట్యూట్ ద్వారా అందజేసినట్టు ఆమెచెప్పారు. విశాఖలోని క్రీడాకారులకు కొదవ లేదన్నారు. చదువుతోపాటు క్రీడలు, సామాజిక అంశాలు, వ్యక్తిగత ఎదుగుదలను తామెప్పుడు ప్రోత్సహిస్తామని తెలిపారు.

స్విమ్మింగ్‌లో సత్తాచాటిన విశాఖ స్విమ్మర్లు



విజేతలతో కోచ్

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 15: తొమ్మిదవ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్ బాలుర, బాలికల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో విశాఖ స్విమ్మర్లు ఓవరాల్‌రన్నరప్ ట్రోఫీని సాధించారు. కర్నూలులో జరిగిన ఈ టోర్నీలో విశాఖ స్విమ్మర్లు ఫ్రీ స్టైల్, బటర్ ఫ్లై, బ్రెస్ట్ స్ట్రోక్, బ్యాక్ స్ట్రోక్, ఐ.ఎం ఈ వెంట్లలో అద్భుతంగా రాణించి పది స్వర్ణ, 15 రజత, ఆరు కాంస్య పతకాలు, 110 పాయింట్లతో ఓవరాల్ రన్నరప్‌గా నిలిచారు. పతకాలు సాధించిన వారిలో బాలుర విభాగంలో గణేష్ చక్రధర్, జిషితేష్ నాయుడు, ప్రియాష్ నాయుడు, బండి సౌరవ్, తమ్మిరెడ్డి సంజయ్, వీవీఎస్. వైభవ్, బాలికల విభాగంలో నిస్తా పాట్లే, బి.పి.కనకలక్ష్మి, పీతల సరయు, కర్ని అనన్య, అంజలి యాదవ్, చుక్కా హైందవి ఉన్నారు. అలాగే, త్వరలో భువనేశ్వర్‌లో జరిగే జాతీయస్థాయి టోర్నీలో పాల్గొనే ఆంధ్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా స్విమ్మింగ్ సంఘం కార్యదర్శి మోహన్ వెంకటరామ్, ఇతర ప్రతినిధులు స్విమ్మర్లను, కోచ్ శ్రీధర్‌ను అభినందించారు.

ఒత్తిడి లేని బోధన అవసరం

కంచరపాలెం, జూలై 15 : ట్యూషన్ కేంద్రాల నిర్వాహకులతో రెండు రోజుల నుంచి కంచరపాలెం బీఎస్‌ఆర్ భవనంలో నిర్వహించిన ప్రాంతీయ శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పలువురు నిపుణులు ,స్టేట్ రీసోర్సు పర్సన్ డాక్టరు అనంతలక్ష్మి ఒత్తిడి లేని విధంగా ఆకర్షణీయంగాబోధనపై అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ డా.కె.రమాప్రభ అధ్యక్షతన జరిగినఈ శిబిరంలో వివిధ జిల్లాల ట్యూషన్ కేంద్రాల నిర్వాహకులు, ప్రైవేట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూత్ ఫుల్ ఫ్యామిలీ సినిమా 'పేకమేడలు'

» హీరో వినోద్ కిషన్



సమావేశంలో హీరో హీరోయిన్లు వినోద్‌కిషన్, అనూష కృష్ణ, తదితరులు

డాబాగార్డెన్స్, జూలై 15: యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా పేకమేడలు సినిమా రూపొందించినట్టు హీరో వినోద్ కిషన్ అన్నారు. క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్ బ్యానర్‌పై నా పేరు శివ ఫేమ్ వినోద్‌కిషన్ హీరోగా, అనూష కృష్ణ హీరోయిన్‌గా నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేష్‌వర్రే పేకమేడలు నిర్మించారు. ఈ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా సోమవారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో సినిమా యూనిట్ విలేకరుల సమావేశం నిర్వహించారు. హీరో వినోద్ కిషన్ మాట్లాడుతూ ఈ నెల 19న చిత్రం విడుదల కానుందన్నారు. మధ్యతరగతి కుటుంబం నేపథ్యంలో సాగుతుందన్నారు. అన్ని వర్గాలను ఆకట్టుకుంటుందని తెలిపారు. హీరోయిన్ అనూష కృష్ణ మాట్లాడుతూ తనకు తెలుగులో ఇది తొలి సినిమా అన్నారు. దర్శకుడు ఈ చిత్రాన్ని బాగా తెరకెక్కించారన్నారు. నిర్మాత రాకేష్ వర్రె మాట్లాడుతూ మధ్య తరగతి ప్రజలు పడే బాధలు, వారి మధ్య భావోద్వేగాలను తెరకెక్కించామన్నారు.

1912కు ఫోన్ చేస్తే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్

ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్



విశాఖపట్నం, జూలై 15: వ్యవసాయానికి కొత్త విద్యుత్ కనెక్షన్ కావలసిన వారు టోల్‌ఫ్రీ నెంబరు 1912కు ఫోన్ చేసి సర్వీస్ పొందవచ్చునని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్ల పరిధిలోని వినియోగదారులు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ కోసం 1912కు ఫోన్ చేసి కనెక్షన్ పొందవచ్చునని పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఏపీ ఈపీడీసీఎల్ పరిధిలోని మీసేవా కేంద్రాల, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. కొత్త విద్యుత్ కనెక్షన్ల అప్లికేషన్‌లు అప్‌లోడు చేసేటప్పుడు ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయడం ద్వారా విద్యుత్ కనెక్షన్ పొందే నూతన రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. 1912 నంబరు ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడానికి ఫోన్ చేసే సమయంలో రైతులు తమ ఆధార్ నంబరు, రిజిస్టర్డ్ మొబైల్ నంబరు, పట్టాదారు పాస్‌బుక్ నంబరు, సర్వే నంబరు, వాల్టా సర్టిఫికెట్ నంబరు, కుల ధ్రువీకరణ పత్రం నంబరు తదితర వివరాలు తెలియజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సంస్థ పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

'మాస్టర్ ప్లాన్ సవరించాలి'

సిరిపురం, జూలై 15: వీఎంఆర్‌డీఏ రూపొందించిన 2041 మాస్టర్‌ప్లాన్ పూర్తిగా లోపభూయిష్టంగా ఉందని జనసేన నేత పీతలమూర్తియాదవ్ అన్నారు. సోమవారం వీఎంఆర్‌డీఏ కమిషనర్ రవీంద్రను పీజీఆర్‌ఎస్‌లో కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వంలో విశాఖలో చేసిన అతిపెద్ద కుంభకోణాల్లో వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ ఒకటి అన్నారు. ఇది ప్లాన్ కాదని విజయసాయిరెడ్డి మాస్టర్ స్కామ్ విమర్శించారు. ఈ నేపథ్యంలో దీనిని రద్దు చేయాలని కోరారు. ఈ ప్లాన్‌పై 9,300 అభ్యంతరాలు వచ్చాయన్నారు. ఎక్కడాలేని విధంగా 200 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణ ఇందులో ఉందన్నారు. మాజీ ఎంపీ ఎంవీవీకి టీడీఆర్ ఇచ్చేందుకు సిరిపురం రోడ్డు 45 మీటర్లు, దసపల్లా భూములు టీడీఆర్‌లు కోసం 100 అడుగుల రోడ్డు , సన్ రే రిసార్ట్స్ అనుకూలంగా మాస్టర్ ప్లాన్‌లో చేసిన మార్పులను వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా నూతన మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని కోరారు.



వీఎంఆర్‌డీఏ కమిషనర్ రవీంద్రకు ఫిర్యాదు అందజేస్తున్న మూర్తియాదవ్

సమస్యలకు సత్వర పరిష్కారం

» జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి కృష్ణ

జ్ఞానాపురం, జూలై 15: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించాలని జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి కృష్ణ అన్నారు. సోమవారం స్థానిక తనకార్యాలయంలో వినతులు స్వీకరించారు. వీటిలో ఇంజనీరింగ్ విభాగానికి, పట్టణప్రణాళికు రెండు చొప్పున, యూసీడీకి ఒకటి వచ్చింది. ఈ కార్యక్రమంలో సూపరెండెంట్ టి.ఎస్ఎన్.రాజు, ఈఈలు మృత్యుంజరాజు, తారా ప్రసన్న, ఏసీపీ వెంకటరావు, టీపీఓ విజయ్‌కుమార్, వైద్యాధికారి సునీల్ కుమార్, ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఏపీడీలు చిరంజీవి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులతో మాట్లాడుతున్న జడ్సీ ఆర్.జి.వి కృష్ణ

తహసీల్దార్ కార్యాలయంలో వినతుల స్వీకరణ

సీతమ్మధార: సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రాలను తహసీల్దార్ శ్రీరామమూర్తి స్వీకరించారు. పలువురు విద్యార్థులు ధ్రువపత్రాల కోసం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్స్ , అలాగే, కుల ధ్రువపత్రాల కోసం దరఖాస్తులను ఇచ్చారు. వీటిని పరిశీలించిన అనంతరం ధ్రువపత్రాలను మంజూరు చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇబ్రాహిం పాల్గొన్నారు.



దరఖాస్తులు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీరామమూర్తి

గుప్పుమంటున్న గంజాయి

... 5వ పేజీ తరువాయి

అదుపులోకి తీసుకుని విచారించగా స్నేహితుడు పుట్టినరోజు సందర్భంగా బహుమతిగా ఇచ్చేందుకు తీసుకువస్తున్నట్టు చెప్పడంతో పోలీసులు అవాక్కయ్యారు. ఏయూలోని ఇంజనీరింగ్ కళాశాల హాస్టళ్లలో కొన్నాళ్ల కిందట విద్యార్థుల వద్ద గంజాయి ప్యాకెట్లు, గంజాయి సిగరెట్లు లభ్యమయ్యాయి. ఈనెల 11న అర్ధరాత్రి సమయంలో మద్దిలపాలెంలోని ట్రిబుల్ ఎస్ బార్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఒక ఆటోలో నాలుగు సూట్‌కేసులు, ఐదు బ్యాగుల్లో 200 కిలోల గంజాయి లభ్యమైంది. నిందితుల్లో ఒకరు విద్యార్థి ఉన్నట్టు ప్రచారం జరిగినప్పటికీ పోలీసులు మాత్రం ఖండించారు.

చీకటిపడితే గుబులు

గంజాయి వినియోగం నేపథ్యంలో నగరంలో చీకటిపడితే చాలు ప్రజలు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీధుల్లో చీకటిగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఖాళీగా ఉన్న స్థలాల్లో యువకులు గుంపులుగా చేరి గంజాయిని సేవిస్తున్నారు. ఎంవీపీ కాలనీలోని ఎ.ఎస్.రాజా మైదానం, మద్దిలపాలెం ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానం, వన్‌టౌన్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, బీచ్‌రోడ్డు, ఎగ్జిబిషన్ మైదానం, ఏపీఐఐసీ మైదానం, ఆంధ్రా వైద్య కళాశాల బాయ్స్ హాస్టల్ మైదానం, ముడసర్లోవ పార్కు, బీఆర్‌టీఎస్ రోడ్డు, రైల్వేస్టేషన్ పరిసరాలు, పాతజైలు రోడ్డు వంటి ప్రాంతాలు చీకటిపడితే గంజాయి బ్యాచ్‌లకు కేంద్రాలుగా మారిపోతున్నాయి. దీంతో రాత్రిపూట ఆయా ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగించేవారు భయాందోళన చెందుతున్నారు. ఎవరైనా వచ్చి గొడవకు దిగినాసరే ఎదురు చెప్పే సాహసం కూడా చేయకుండా ఎలాగోలా అక్కడి నుంచి తప్పించుకుని వెళ్లిపోయేందుకు యత్నిస్తున్నారు. రాత్రిపూట ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా బీట్‌లు, పికెట్‌లు ఏర్పాటుచేస్తే గంజాయి గ్యాంగ్‌లకు అడ్డుకట్టపడుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి దీనిపై దృష్టిసారించాలని నగరవాసులు కోరుతున్నారు.

ఉద్యోగాలు పేరుతో...

... 5వ పేజీ తరువాయి

నిర్ణయించారు. దీనికోసం ప్రతిపాదనలు తయారుచేయాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. ఈ మేరకు 25 మంది కార్మికులను తీసుకునే బాధ్యతను మలేరియా అధికారితోపాటు ఆ విభాగంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఉద్యోగికి అప్పగించారు. ఇదే అదనుగా భావించిన సదరు శానిటరీ ఇన్‌స్పెక్టర్ జీవీఎంసీలో ఉద్యోగాలంటూ నిరుద్యోగులు, మహిళలను మభ్యపెట్టాడు. ప్రస్తుతానికి తాత్కాలికమే అయినప్పటికీ తర్వాత ఆప్కోస్‌లో చేరిపోతారని ఆశపెట్టడంతో ఎక్కువ మంది ఆసక్తి చూపారు. అలాంటివారి నుంచి ఉన్నతాధికారులకు ఇవ్వాలని చెప్పి రూ.60 వేలు నుంచి రూ.1.2 లక్షలు వరకూ వసూలు చేసి...కార్మికులకు తీసుకున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయం జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా, వారంతా రోజువారీ కూలీ ప్రాతిపదికన తీసుకున్న వారేనని, సీజన్ అయిపోయిన తర్వాత ఆపేస్తామన్నారు. దీనికోసం తాము డబ్బులు ఇచ్చామంటూ ఎవరూ ఇంతవరకూ తమ దృష్టికి తీసుకురాలేదన్నారు. ఒకవేళ ఎవరైనా డబ్బులు ఇచ్చినా, లేదా మరెవరైనా ఇచ్చినట్టు ఆధారాలు ఉన్నా తమకు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి బాధ్యుడైన ఉద్యోగిపై చర్యలు తీసుకుంటామన్నారు.

తవ్వకాలు చేపట్టి వదిలేశారు..

స్మార్ట్ సిటీ అధికారుల నిర్వాకంతో పాట్లు



30వార్డులో అసంపూర్తి అండర్ విద్యుద్దీకరణ పనులు

జగదాంబ కూడలి, జూలై 15: గ్రేటర్ 30 వార్డులో విద్యుత్ అండర్ కేబుల్ పనుల కోసం రోడ్లు తవ్వకాలు చేపట్టి వదిలేయడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఎన్నికల కోడ్‌కు ముందు స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా విద్యుత్ అండర్ కేబుల్ వేసేందుకు టర్నర్ చౌల్ట్రీ మెయిన్ రోడ్డు వైపు పనులు చేపట్టారు. నివాసితుల ఇళ్లకు సంబంధించి అండర్ గ్రౌండ్ విద్యుత్ కనెక్షన్ల నిమిత్తం ఇరుకు సందులో పనులను జీవీఎంసీ చేపట్టింది. కేబుల్ తవ్వి ఐదారు నెలలవుతున్నా, తిరిగి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టలేదు. ఇళ్లలోకి వెళ్లేందుకు నివాసితులు నిత్యం అవస్థలు పడుతున్నారు. అలాగే, భూమిలోనుంచి విద్యుత్ కనెక్షన్ కోసం తవ్విన కేబుల్ సక్రమంగా అమర్చలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రోడ్లు మరమ్మతులు చేపట్టాలని జీవీఎంసీ అధికారులు కోరినా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు.

కలెక్టర్‌ను కలిసిన డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



కలెక్టర్‌ను సన్మానిస్తున్న శ్రీధర్

సిరిపురం, జూలై 15: కలెక్టర్, జీవీ ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్‌ను నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, సత్కరించారు.నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

కేజీహెచ్‌లో సేవలపై గరంగరం

... 5వ పేజీ తరువాయి

పెట్టుకుని రూ.200-300 కోట్లతో భారీగా భవన నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. నిధులు గురించి బెంగ వద్దని, అందుకు అనుగుణమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. కేజీహెచ్ పట్ల ప్రజల్లో మంచి భావన ఉండేదని, అది క్రమంగా తగ్గుతోందని, దాన్ని మళ్లీ పెంచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మంచి రోజులు వచ్చాయని, మంచి నాయకత్వంతో ముందుకు వెళుతున్నామన్నారు.ఆస్పత్రి అవసరాలను చెప్పాలని, వాటిని తీర్చేందుకు కృషిచేస్తామన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు పరిశోధనలు సాగించడం ద్వారా ప్రివెంటివ్ మెథడ్స్‌పై దృష్టిసారించాలని శ్రీభరత్ సూచించారు.కేజీహెచ్‌తో పాటు జిల్లా అంతటా ఫాగింగ్ చేయించడంపై దృష్టిసారించాలని ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు.

ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ కేజీహెచ్‌లో నిపుణులైన వైద్యులు, వందలాది మంది సిబ్బంది ఉన్నప్పటికీ ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన దుస్థితి నిరుపేద రోగులకు ఏర్పడుతోందన్నారు. కేజీహెచ్‌కు రావాలంటే ఇప్పటికీ రోగులు భయపడుతుంటారని, మెరుగైన సేవలు అందవన్న భయం రోగుల్లో ఉందన్నారు. నర్సింగ్ స్టాఫ్ కొరత ఎప్పటి నుంచో వేధిస్తోందని, దీనివల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆస్పత్రి అవసరాలకు తగ్గ సిబ్బంది లేరన్నారు.ప్రతిరోగికి మెరుగైన సేవలు అందించేలా ఆస్పత్రిని తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేయాలని, అవి తీసుకొచ్చే బాధ్యతను తాము తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో రోగులకు సహకారాన్ని అందించేలా హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటుచేయాలని విష్ణుకుమార్‌రాజు సూచించారు. రోగుల పట్లతో ప్రేమతో వ్యవహరించాలన్నారు. ఇక్కడకు వస్తే మెరుగైన వైద్య సేవలు అందుతాయన్న భావన ప్రజల్లో కలగాలన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేజీహెచ్‌లో సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యులు కూడా రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు శాయశక్తులా కృషి చేయాలని సూచించారు. వైద్య వృత్తిలో డబ్బు సంపాదించాలన్న ఆలోచన సరికాదని, వ్యాపారులు మాత్రమే డబ్బు సంపాదిస్తారని, ఇందులో సేవాగుణం మాత్రమే ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి సహకారాన్ని అందిస్తాం : మంత్రి సత్యకుమార్

వందేళ్ల చరిత్ర కలిగిన ఏఎంసీ నుంచి వేలాది మంది వైద్యులుగా బయటకు వెళ్లి దేశ, విదేశాల్లో స్థిరపడ్డారని వారంతా ఆస్పత్రి అభివృద్ధికి సహకారాన్ని అందించాలన్నారు. దాతల సహకారంతో విభాగాలకు అవసరమైన పరికరాలు కొనుగోలు చేయాలన్నారు. ప్రజలు ప్రైవేటు ఆస్పత్రుల వైపు చూసే రోజులు పోవాలని, ప్రభుత్వ ఆస్పత్రులు వైపు వచ్చేలా చేయాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. ఆస్పత్రుల్లో మౌలిక వసతులు, సిబ్బంది కొరత, ఇతర సమస్యలపై దృష్టిసారించి పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం తరపున ఆస్పత్రి అభివృద్ధికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని స్పష్టంచేశారు. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలకు మ్యాచింగ్ గ్రాంటుకు నిధులను సమీకరిస్తున్నట్టు తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలు చెప్పిన సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రిని ఆస్పత్రి అధికారులు, సిబ్బంది సత్కరించారు. పలువురు సమస్యలపై మంత్రికి వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, టీడీపీ నాయకులు పీలా గోవింద్ సత్యనారాయణ, గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, కేజీహెచ్ ఆర్‌ఎంవో డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ లోకనాథం, డాక్టర్ గోపి, డాక్టర్ గిరినాథ్, డాక్టర్ సుబ్రహ్మణ్యంతోపాటు వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

దుకాణాలతో దందా

... 5వ పేజీ తరువాయి

కొనసాగించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించినా తమ అధికారాన్ని ఉపయోగించి తిరిగి ఏర్పాటుచేసేలా చక్రం తిప్పారు. హెచ్‌బీ కాలనీ, శివాజీపాలెం, ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు వంటి ప్రాంతాల్లో దుకాణాలను తొలగిస్తే వార్డు స్థాయి నేతలే వారిపై తిరగబడడంతో జీవీఎంసీ అధికారులు మిన్నకుండిపోయారు.

దుకాణాలకు టులెట్ బోర్డులు

రోడ్డుపక్కన నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలను ఏర్పాటుచేసుకుని అద్దెకిస్తున్న కొందరు అవి ఖాళీ అయితేటులెట్ అని బోర్డులు వేలాడతీస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. జీవీఎంసీ అధికారులు బోర్డులను చూస్తున్నప్పటికీ కనీసం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ సమీపంలో రోడ్డుపక్కన ఏర్పాటు చేసిన దుకాణాలకు టులెట్ బోర్డులు దర్శనమిస్తున్నాయి.వాహనాల రాకపోలకు ఇబ్బంది కలిగించేలాఉన్న దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

గాజువాకలో హత్య

... 5వ పేజీ తరువాయి

నడుస్తుంది. ఈ నేపథ్యంలో రాము, అశోక్‌లు కలిసి అప్పలనాయుడును హతమార్చారు. సంఘటనా స్థలాన్ని డీసీపీ మోకా సత్తిబాబు, ఏసీపీ టి.త్రినాథ్, సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. కాగా మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. స్థల వివాదమే హత్యకు కారణమని డీసీపీ మోకా సత్తిబాబు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని, నిందితులపై గతంలో స్టేషన్‌లో కేసులు ఉన్నాయని తెలిపారు.

ఏయూ అధికారులు ఉక్కిరిబిక్కిరి

» సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం సమాచారం బయటకు రావడంపై ఆందోళన

» రిజిస్ట్రార్ కార్యాలయానికి నివేదిక

విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో గత నెల 18న సంభవించిన అగ్నిప్రమాదంపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం క్యాంపస్‌లో ప్రకంపనలు సృష్టించింది. గుట్టుగా సాగిపోయిందనుకున్న వ్యవహారం వెలుగులోకి రావడంతో పలువురు అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్టు తెలిసింది. ఈ విషయం బయటకు ఎలా వచ్చిందని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలావుండగా ప్రిన్సిపాల్ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో కంప్యూటర్, హార్డ్ డిస్క్, స్కానర్, ఇంటర్నెట్ బాక్స్, రెండు ఏసీలు, సీలింగ్ లైట్లు, ఇన్వర్టర్ పూర్తిగా కాలిపోయినట్టు సోమవారం రిజిస్ట్రార్ కార్యాలయానికి సమాచారం అందింది. దీనిపై ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఉన్న కిశోర్‌బాబు ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది. వర్సిటీలో పీహెచ్‌డీలు, ప్రొఫెసర్‌షిప్‌లపై ఆరోపణలు వస్తుండడంతో అడ్డగోలు నియామకాలకు సంబంధించిన ఆధారాలు బయటపడకూడదనే ఫైళ్లు దగ్ధం చేసేందుకు యత్నించి ఉంటారని, ఆ క్రమంలోనే మంటలు ఎగిసి ప్రమాదం సంభవించి ఉంటుందనే ప్రచారం ఇప్పటికే జరుగుతోంది.



పూజలందుకున్న బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడు

బౌద్ధావతారంలో జగన్నాథస్వామి

అగనంపూడి, జూలై 15: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా ఇక్కడి జగన్నాథస్వామి సోమవారం బౌద్ధావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఇంద్రజ్యుమ్న మందిరంలో కొలువుదీరిన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో పలువురు మహిళలు లలిత, విష్ణు సహస్రనామ పారాయణాలను పఠించగా, స్థానిక భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్పొరేటర్లు రౌతు శ్రీనివాస్, బొండా జగన్‌లు స్వామివారిని దర్శించుకోవడంతో పాటు మధ్యాహ్నం చేపట్టిన అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, జి.సాయికుమార్, నాగేశ్వరరావు, నాగమణి, కుమారి, వరదరాణి, ఆలయ మేనేజర్ జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుగు రథయాత్ర



జగన్నాథస్వామి సన్నిధిలో ఉక్కు సీఎండీ అతుల్‌భట్

ఉక్కుటౌన్‌షిప్, జూలై 15: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో గల జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం తిరుగు రథయాత్ర ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవాల్లో భాగంగా ఈ నెల ఏడున స్వామివారిని ఇంద్రజ్యుమ్న హాల్‌కు తీసుకువెళ్లి, అక్కడ తొమ్మిది రోజులు ఉంచి పూజలు చేపట్టారు. ఉత్సవంలో ఉక్కు సీఎండీ అతుల్‌భట్, వీస్టీల్ మహిళా సమితి అధ్యక్షురాలు నఫూర్‌భట్, పలువురు డైరెక్టర్లు, ఆలయ కమిటీ ప్రతినిధులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు కుంచమాంబ అనుపోత్సవం



మల్కాపురం, జూలై 15: ములగాడ గ్రామంలో మంగళవారం కుంచమాంబ పండగలో భాగంగా అనుపోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల ఆరు నుంచి పండగను వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ అమ్మవారికి దీప, ధూపారాధనలతో భక్తులు మొక్కులు చెల్లిస్తున్నారు. మంగళవారం అనుపోత్సవానికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.



మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సత్కరించారు.

సినిమా గైడ్

● **భారతీయుడు-2:** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలిస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి),

● **కల్కి:** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, శ్రీ నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 37, టమాటా 48, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 26, పచ్చిమిర్చి 70, కాకరకాయలు 40, బీరకాయలు 30, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 42, క్యాబేజీ 32, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 32, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 140, మునక్కాడలు (కిలో) 120, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 50, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 100, పొటల్స్ 40, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 36, కంద 60, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 90
ఫారం ధర	-- 110
విత్ స్కిన్	-- 190
స్కిన్‌లెస్	-- 200

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

రహదారా.. మురుగు కాలువా?





65వ వార్డు పరిధి కాకతీయ జంక్షన్ దగ్గర బీసీ రోడ్డు మీదుగా ప్రవహిస్తున్న మురుగునీరు. (ఇన్‌సెట్లో) రహదారిపై పేరుకుపోయిన చెత్తాచెదారం

పెదగంట్యాడ, జూలై 15: మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) 65వ వార్డు పరిధి బీసీ రోడ్డు కాకతీయ జంక్షన్ దగ్గర రహదారి మురుగు కాలువను తలపిస్తోంది. ఇక్కడ మురుగు నీరంతా రోడ్డు మీదుగా దిగువ ప్రాంతానికి ప్రవహిస్తోంది. మురుగుతో పాటు కొట్టుకువచ్చిన చెత్తాచెదారి, ఇతర వ్యర్థాలు ఎక్కడికక్కడ రోడ్డుపై తిష్ట వేయడంతో ఈ ప్రాంతం అధ్వానంగా మారింది. ఈ రోడ్డు పక్కనే ఉన్న శిథిల డ్రైనేజీని తొలగించి కొత్తగా నిర్మాణ పనులు చేపట్టిన జీవీఎంసీ సిబ్బంది ఈ ప్రాంతానికి ఎగువన కాలువకు అడ్డుకట్ట వేయడం వల్లే ఈ దుస్థితి ఏర్పడింది. డ్రైనేజీ నుంచి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగు నీరు దిగువకు పోయేందుకు వీలుగా ప్రత్యామ్నాయ మార్గం చూపకుండా అడ్డుకట్ట వేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగు అంతా బీసీ రోడ్డు మీదుగా దిగువకు ప్రవహిస్తుంది. దీంతో ఈ మార్గం అంతా దుర్గంధభరితంగా మారడంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించేందుకు ప్రజలు నరకయాతన పడుతున్నారు. కొత్త గాజువాక నుంచి పెదగంట్యాడ వైపు రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ఈ రహదారి నుంచే ప్రయాణిస్తున్నారు. ఆర్టీసీ బస్సులు, పెదగంట్యాడ పారిశ్రామికవాడకు రాకపోకలు సాగించే భారీ వాహనాలు, గాజువాక, రాజీవ్ రోడ్డు ప్రాంతాల నుంచి స్టీల్‌ప్లాంటుకు రాకపోకలు సాగించే ఉద్యోగులు, కార్మికులు కూడా ఈ రోడ్డు నుంచే ప్రయాణిస్తున్నారు. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే ఈ రోడ్డులో ఇలాంటి దుస్థితి నెలకొనడంతో వారు నానాపాట్లు పడుతున్నారు. మురుగు నీరే ఈ స్థాయిలో రోడ్డుపై పారుతుంటే.. ఒకవేళ భారీ వర్షం కురిస్తే పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి

-ఎస్.ఈశ్వరరావు, పితానివానిపాలెం



కాకతీయ జంక్షన్ వద్ద బీసీ రోడ్డు మీదుగా మురుగు నీరు ప్రవహించకుండా జీవీఎంసీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీని పునర్నిర్మించే ముందు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగు నీరు దిగువకు సాఫీగా పోయేందుకు వీలుగా ఏర్పాటు చేయకుండా డ్రైనేజీకి అడ్డకట్ట వేయడం వల్ల ఇలాంటి పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నీరు రహదారిపై పారకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్



దీక్షా శిబిరంలో మంత్రి రాజశేఖర్, తదితరులు

కూర్మన్నపాలెం, జూలై 15: స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా కూటమి ప్రభుత్వం కృషి చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,250వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేస్తే భూములు ఇచ్చిన నిర్వాసితుల జీవితాలను అంధకారం చేయడమే అవుతుందన్నారు. ఉక్కు కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ప్రధాని మోదీతో మాట్లాడి స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామన్న ప్రకటన చేయాలని కోరారు. చైర్మన్ డి.ఆది నారాయణ మాట్లాడుతూ కొద్ది నెలలుగా కాంట్రాక్టు కార్మికులకు జీతాలు ఇవ్వక పోవడం దారుణమన్నారు. కర్మాగారంలో ఉత్పత్తికి సరిపడా ముడిసరకు లేక కార్మికులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ సాధారణ ఉత్పత్తి దిశగా నడిచేందుకు, కార్మికులకు వేతనాలు సకాలంలో అందించేందుకు అధికారులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు వరసాల శ్రీనివాసరావు, ఎస్.రామారావు, రామస్వామి, నీరుకొండ రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పురందేశ్వరిని కలిసిన పోరాట కమిటీ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, సెయిల్‌లో విలీనం చేస్తే మంచి ఫలితాలు వస్తాయని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. నగరంలో ఆమెను కలిసి పలు విషయాలపై చర్చించారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తే ఉక్కు ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని, తద్వారా ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. అదేవిధంగా ప్రైవేటీకరణ ప్రయత్నాలను కేంద్రం విరమించుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీని కలిసిన వారిలో నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, వరసాల శ్రీనివాసరావు, విళ్లా రామ్మోహన్‌కుమార్, తదితరులు ఉన్నారు.



అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు

ఘనంగా పైడితల్లమ్మ తొలేళ్ల ఉత్సవం

పెందుర్తి, జూలై 15: పెందుర్తి ప్రజల ఆరాధ్య దేవత పైడితల్లమ్మ తొలేళ్ల ఉత్సవాన్ని సోమవారం తాండ్రపాపారాయుడు వెలమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మహిళలు ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. స్థానిక చిన్న మిల్లు నుంచి 500 కిలోల వివిధ రకాల స్వీట్లతో మహిళలు ఆలయానికి చేరుకుని పైడితల్లమ్మకు సారెను నైవేద్యంగా పెట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రధాన పండగను మంగళవారం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఆలయ ప్రాంగణం వద్ద అన్న సమారాధనను ఏర్పాటు చేసినట్టు రామునాయుడు తెలిపారు. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జి రాము నాయుడు, గొర్లె శ్రీనివాసరావు, దాసరి శ్రీను (చిన్నమిల్లు) బండారు నాగు, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్లను తప్పనిసరిగా ధరించాలి: సీఐ షణ్ముఖరావు

సింధియా, జూలై 15: ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్లను ధరించాలని మల్కాపురం ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు సూచించారు. సోమవారం మారుతి సర్కిల్‌తో పాటు హార్బర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనచోదకులను హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకుగాను ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోరారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మంత్రి అనితను కలిసిన టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

అక్కిరెడ్డిపాలెం, జూలై 15: పారిశ్రామిక ప్రాంతంలోని ఎస్సీ కాలనీ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితకు పారిశ్రామిక ప్రాంత టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు కోరారు. సోమవారం నగరంలో ఆమెను కలిసి ఎస్సీ కాలనీలోని సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు పి.జయరాజ్, మునపర్తి ఆనంద్, కె.నాగేశ్వరరావు, జయప్రకాశ్, తదితరులు ఉన్నారు,

'సమస్యలపై కార్మికులను చైతన్యపరచాలి'

ఉక్కుటౌన్‌షిప్, జూలై 15: ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యలపై నిష్ణాతులతో కార్మికుల్లో అవగాహన, చైతన్యాన్ని కలిగించి వారిని పోరాటాలకు సంసిద్ధులను చేయడం ద్వారానే ప్రైవేటీకరణ సమస్యకు పరిష్కారం లభ్యమవుతుందని సీఐటీయూ స్టీల్‌ప్లాంట్ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరాం అన్నారు. సీఐటీయూ ప్లాంట్ నాయకుల ఆధ్వర్యంలో ఈ నెల 17న 'సంక్షోభంలో విశాఖ ఉక్కు- పరిష్కారం ఎలా' అనే అంశంపై జరగనున్న సదస్సుకు సంబంధించిన పోస్టరును సోమవారం ప్లాంట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలో సంక్షోభాలను ఎదుర్కొనడంలో సీఐటీయూ కీలకపాత్ర పోషిస్తుందన్నారు.

గత కొంతకాలంగా ప్లాంట్‌కు గనులు కేటాయించాలని, ప్రైవేటీకరించరాదని పాదయాత్రలు, రక్తదానాలు, తదితర కార్యక్రమాలను చేపట్టి కార్మికులతో పాటు ప్రజలకు చైతన్యం కల్పించామన్నారు. 17న జరిగే సదస్సుకు స్టీల్‌ప్లాంట్ మాజీ సీఎండీ వై.శివసాగరరావు, సీఐటీయూ అఖిలభారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, రిటైర్డు ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ, తదితరులు హాజరు కానున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసరాజు, కె.గంగాధర్, నీలకంఠం, కృష్ణమూర్తి, రాజు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో ముందంజలో ఆర్యవైశ్యులు

కూర్మన్నపాలెం, జూలై 15: ఆర్యవైశ్యులు సమాజ సేవా కార్యక్రమాల నిర్వహణలో ముందుంటారని వడ్లపూడి ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కారుమూరి మహేశ్ అన్నారు. 88వ వార్డు పరిధి ఎస్టీబీఎల్ కాలనీలో ఓ పేద కుటుంబానికి అమ్మ వాసవి సేవా ట్రస్టు గాజువాక శాఖ ఆధ్వర్యంలో పసుమర్తి సురేశ్ అందించిన ఆర్థిక సాయంతో రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరకులను అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ ప్రతినెలా తాము పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ట్రస్టు సేవలను వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు వి.కృష్ణ, అప్పల సత్యనారాయణ గుప్తా, బి.పెంటబాబు, రాము, కామేశ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో శ్రమదానం



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న దృశ్యం

కూర్మన్నపాలెం, జూలై 15: జీవీఎంసీ 86వ వార్డు పరిధి రావుల చెరువు ప్రాంగణంలో దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు ఆధ్వర్యంలో సోమవారం శ్రమదానం చేశారు. పెద్దఎత్తున పేరుకుపోయిన తుప్పలు, చెత్తాచెదారాలను పోలీసులు, వాకర్లు తొలగించారు. ఈ సందర్భంగా ఎర్రంనాయుడు మాట్లాడుతూ విద్యార్థులు, యువత గంజాయికి అలవాటు పడకుండా వాకర్లు అవగాహన కల్పించాలని కోరారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు సాగినా, గంజాయికి సంబంధించిన సమాచారం తెలిసినా తమకు తెలియజేయాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సవచారం అందించాలని పేర్కొన్నారు.

రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ వద్ద కాంట్రాక్టు కార్మికులు ధర్నా

ఆటోనగర్, జూలై 15: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వడ్లపూడి రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ వద్ద సోమవారం కాంట్రాక్టు కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఈస్ట్‌కోస్ట్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు వీవీ రాజు రాజు మాట్లాడుతూ కార్మికులకు పనికి తగిన వేతనం చెల్లించాలన్నారు. ఈఎస్‌ఐ, పీఎఫ్, సేఫ్టీ అమలు చేయాలన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నాయకులు అవతారం, రాంబాబు, వెంకటేశ్వరరావు, సతీశ్, సురేశ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బోర్లకు మరమ్మతులు చేయించిన కార్పొరేటర్

సింధియా, జూలై 15: జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవలో మరమ్మతులకు గురైన నాలుగు బోరింగులకు సోమవారం కార్పొరేటర్ గల్లా చిన్న దగ్గరుండి మరమ్మతులు చేయించారు. కాలనీలోని పలుచోట్ల బోరింగులు మరమ్మతులకు గురవ్వడం వల్ల స్థానికులు నీటి కోసం పడుతున్న ఇక్కట్లను దృష్టిలో పెట్టుకుని వాటికి మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మల్కాపురం, జూలై 15: శ్రీహరిపురలో సోమవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ టీడీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుతం డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ , అతిసార వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 60వ వార్డు అధ్యక్షుడు మాతా శ్రీను, వినయ్‌కుమార్, లక్ష్మీనారాయణ, కోలాటి రామశంకర్, అంగ పద్మ, శ్రీను, మహేష్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ

అగనంపూడి, జూలై 15: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక సర్వహిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులైన 65 మందికి ప్రతినెలా మాదిరిగానే ఒకొక్కరికి రూ.200 చొప్పున పింఛన్‌తో పాటు పలు నిరుపేద కుటుంబాలకు సోమవారం నిత్యావసర సరకులను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు గుదే సుశీల గజేంద్రరావు, పట్టా రామ అప్పారావు, నరసింగరావు, మస్తాన్‌రెడ్డి, గణేశ్, జి.వెంకటరమణ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన పోలీసు క్వార్టర్స్‌ను పరిశీలించిన ఏడీసీపీ

మల్కాపురం., జూలై 15: శిథిలావస్థలో ఉన్న మల్కాపురంలోని పోలీసు క్వార్టర్స్‌ను ఏడీసీపీ (ఏఆర్) నారాయణరావు సోమవారం పరిశీలించారు. మల్కాపురం సీఐ విద్యాసాగర్ ఈ క్వార్టర్స్ అధ్వాన స్థితిని తెలియజేస్తూ లేఖ రాయడంతో ఏడీసీపీ వచ్చి పరిశీలించారు. గతంలో ఈ స్టేషన్‌లో పనిచేసే సిబ్బంది ఇక్కడే నివాసం ఉండేవారు, ఇప్పుడు క్వార్టర్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిలో విషసర్పాలు అధికంగా ఉండడంతో ఈ భవనాలను పూర్తిగా నేలమట్టం కొత్త వాటిని నిర్మించాలని సిబ్బంది కోరుతున్నారు.



చెరువును తలపిస్తున్న జెడ్పీ హైస్కూల్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణం

వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం

గోపాలపట్నం, జూలై 15: బంగాళాఖాతంలో ఆవర్తనం ప్రభావంతో సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో జనాలు ఊరట చెందారు. ఈ వర్షానికి బీఆర్‌టీఎస్‌పై పలుచోట్ల నీరు నిలిచిపోయింది. గోపాలపట్నం కొండవాలు ప్రాంతాల నుంచి కాలువల ద్వారా వచ్చే వర్షపు నీరు సజావుగా ప్రవహించడానికి ఇటీవల కొత్తపాలెం గ్రామ శివారుల్లోని గెడ్డల్లో పూడికతీత పనులు ముమ్మరంగా చేపట్టారు. దీంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వర్షం కొత్తపాలెంశివారులోని లోతట్టు ప్రాంతాలకు ప్రవహించింది. వర్షంతో స్థానిక జెడ్పీ హైస్కూల్‌లోని క్రీడామైదానం జలమయమైంది. ఇక్కడ నీరు వెళ్లే మార్గం లేక భారీ వర్షం కురిసిన ప్రతిసారి క్రీడా మైదానంలోని ఇండోర్ స్పోర్ట్ కాంప్లెక్స్ ప్రాంతంలో నీరు నిలిచిపోతోంది. కొద్ది రోజుల పాటు బురదగా నిలిచిపోవడం వల్ల క్రీడాకారులు, పాఠశాల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: ఎన్.ఎ.డి. పరిసర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎన్.ఎ.డి. గణేష్‌నగర్, ఉడాకాలనీ సంజీవయ్య కాలనీ, ఎన్.ఎస్.టి.ఎల్. గేటు పరిసరాలు, వినోద్‌నగర్, సాకేతపురం, కాకానీనగర్, విమాన్‌నగర్ శివారు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. ఎన్.ఎ.డి. ఫ్లైఓవర్ నీరు చేరడంతో వాహనాలను నిలిపివేసి పలువురు కొద్దిసేపు నిలిచిపోయారు. బుచ్చిరాజుపాలెం బీఆర్‌టీఎస్ బస్‌స్టాప్ వద్ద, సర్వీస్ రోడ్డులో మోకాలు లోతువరకు వర్షపునీరు నిలిచిపోయింది. ఎన్ఎడీ ఫ్లైఓవర్ కింద ఓ భారీ వాహనం పొరపాటున వేరే మార్గంలో వెళ్లి తిరిగి వెనక్కి మరలడంతో కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది.

నేడు ఆర్టీసీ బస్సు సర్వీసు పునఃప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గోపాలపట్నం, జూలై 15: గోపాలపట్నం దిగువ ప్రాంతాలైన చింతగట్ల, జెర్రిపోతుల పాలెం, నరవ, కోటనరవ, కొత్తపాలెం, పాత గోపాలపట్నం గ్రామాల మీదుగా నగరానికి వెళ్లడానికి ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరిస్తున్నారు. గతంలో ఆయా ప్రాంతాల మీదుగా 6బీ, 556 బస్సు సర్వీసులు నడిచేవి. అయితే శిథిల రహదారులు, రైల్వే గేట్ల సమస్యతో 15 ఏళ్ల కిందట ఆ బస్సులను ఆర్టీసీ రద్దు చేసింది. ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'రద్దు చేసిన బస్సులను నడపాలి' కథనానికి ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించారు. ఈ మేరకు ఒక బస్సుసర్వీసును ప్రస్తుతానికి పునఃప్రారంభిస్తున్నారు. ఈ బస్సును పశ్చిమ ఎమ్మెల్యే పీ.గణబాబు మంగళవారం ప్రారంభించనున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 5 వినతులు

వేపగుంట జూలై 15: వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు ఫిర్యాదులు అందాయి. వీటిలో 92వ వార్డు పరిధి వెంకటాపురంలో రోడ్డు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని కోరారు. గోపాలపట్నం ఇందిరానగర్‌లో ప్రహరీ నిర్మాణం, చెట్టును తొలగించాలని, అడవివరంలో వీధి దీపాలు మార్చాలని పేర్కొన్నారు. ప్రజా మరుగుదొడ్డి ట్యాంకును క్లీన్ చేయించాలని, తదితర ఫిర్యాదులు అందాయి. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఈఈ రత్నాకర్ రెడ్డి తెలిపారు.

ఆరోగ్య శాఖా మంత్రిని కలిసిన శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీజీఎం బంగార్రాజు

వేపగుంట జూలై 15: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సోమవారం నాయుడుతోట శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు, డీజీఎం కె.బంగార్రాజు ఎయిర్‌పోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్రలో తాము అందిస్తున్న వైద్య సేవలను మంత్రికి వివరించడంతో పాటు ఫౌండేషన్ వార్షిక నివేదికను అందజేశారు. తమ ఆస్పత్రికి విచ్చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

కుమ్మర్ల సమస్యలను పరిష్కరించాలని వినతి

అగనంపూడి, జూలై 15: జిల్లా శాలివాహనుల (కుమ్మర్ల) సమస్యలను పర్కిరించాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును సోమవారం కుల సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. పల్లాను కలిసిన వారిలో నాయకులు కె.గడ్డయ్య, కనకారావు, త్రినాథ భాస్కరరావు, తాతారావు, రామస్వామి, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

బీమా ప్రీమియంపై జీఎస్టీ ఎత్తివేతకు చొరవ చూపాలి



ఎంపీ భరత్‌కు వినతి పత్రమిస్తున్న ఐసీఈయూ నాయకులు

డాబాగార్డెన్స్, జూలై 15: ఇన్సూరెన్స్ రంగంలో ఓపీఓ పెంపును విరమించి బీమా ప్రీమియంపై జీఎస్టీ ఎత్తివేసేలా ప్రభుత్వంతో చర్చించాలని ఎంపీ శ్రీభరత్‌ను ఐసీఈయూ విశాఖపట్నం డివిజన్ నాయకులు కోరారు. సోమవారం ఎంపీ భరత్‌ను కలిసి బీమా పరిశ్రమకు సంబంధించిన సమస్యలపై ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖ నాయకులు మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ ఇన్సూరెన్స్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను రానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశంలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీఈయూ జనరల్ సెక్రటరీ జి.వరప్రసాద్, ఏపీ కన్వీనర్ జి.సూర్యప్రభ, నాయకులు సతీష్, గోవింద్, శ్రీనివాసరావు, ఎ.వి.ఆర్.కె. మూర్తి, మీడియా ఇన్‌చార్జి ఎ.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణకు పవన్‌కల్యాణ్ సన్మానం



సన్మానిస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్, జూలై 15: విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన వంశీకృష్ణ శ్రీనివాస్ ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం కేంద్ర కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో పాటు విశాఖ నగర పరిధిలో కూటమి ఎమ్మెల్యేలు విజయంలో తనవంతు పాత్ర పోషించినందుకు వంశీకృష్ణను ప్రశంసించారు.



మాట్లాడుతున్న తెలుగు మహిళలు



పోస్టర్ ఆవిష్కరణలో కార్పొరేటర్, అధికారులు

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

సీతమ్మధార, జూలై 15: పరిసరాల శుభ్రతపై 14వ వార్డులో మహిళలు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మహిళ నాయకురాలు హేమ ఆధ్వర్యంలో సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్ వద్ద నుంచి ఈమేరకు ర్యాలీ నిర్వహించారు.అతిసార, డెంగ్యూ మలేరియా వ్యాధులపై జాగ్రత్త వహించాలని సూచించారు.ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీవో సీహెచ్ లక్ష్మి, ఆర్‌పీ బి.వరలక్ష్మి, గాయత్రి, జి.వరలక్ష్మి, గౌరి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దోమల నివారణపై దృష్టి సారించాలి

జగదాంబ కూడలి: దోమల నియంత్రణపై ఒక్కరు శ్రద్ధ వహించాలని గ్రేటర్ 35 వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పేర్కొన్నారు. సోమవారం పూర్ణామార్కెట్ వెలంపేట ప్రాథమిక పాఠశాలలో జరిగిన డెంగ్యూ వ్యతిరేక వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కె.వి.ఎస్. కుమార్, మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, జి.రమాదేవి, హెచ్‌ఎం రవికుమార్, విద్యార్థులు తల్లిదండ్రులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రులకు గజమాలతో సత్కారం

అక్కయ్యపాలెం, జూలై 15: విశాఖకు విచ్చేసిన కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌లకు నిరుద్యోగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి పీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో గజమాలతో సోమవారం ఘనస్వాగతం పలికారు. విశాఖను దేశంలో ప్రధాన నాలుగు నగరాల్లో ఒకటిగా ఎంపిక చేసి అభివృద్ధి చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ విశాఖకు విచ్చేసిన మం త్రులతోపాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు డైమండ్ పార్కువద్ద గజమాలతో సత్కరించారు. అనంతరం హేమంతకుమార్, కృష్ణారావు మాట్లాడుతూ త్వరలోనే విశాఖకు రైల్వేజోన్ కేటాయించాలన్నారు. దీనివల్ల ఎంతో మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు.

చదువుతోపాటు క్రీడలను ఛాలెంజింగ్‌గా తీసుకోవాలి

» సన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశాజాస్తి



ఏపీఎల్ విజేతకు రూ. లక్ష చెక్కు అందిస్తున్న ఆశాజాస్తి

డాబాగార్డెన్స్, జూలై 15: చదువుతోపాటు క్రీడలనూ నేటి యువతరం ఛాలెంజింగ్‌గా తీసుకోవాలని సన్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశాజాస్తి పేర్కొన్నారు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-3 (2024) విజేతగా నిలిచిన ఆరెంజ్ క్యాప్, పర్పుల్ క్యాప్ విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. ఆరెంజ్ క్యాప్ విన్నర్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ టోర్నమెంట్ అశ్విన్ హెబ్బర్, పర్పుల్ క్యాప్ విన్నర్ సుదర్శన్ కొదవండ్లకు రూ.లక్ష చొప్పున బహుమతి ఇనిస్టిట్యూట్ ద్వారా అందజేసినట్టు ఆమెచెప్పారు. విశాఖలోని క్రీడాకారులకు కొదవ లేదన్నారు. చదువుతోపాటు క్రీడలు, సామాజిక అంశాలు, వ్యక్తిగత ఎదుగుదలను తామెప్పుడు ప్రోత్సహిస్తామని తెలిపారు.

స్విమ్మింగ్‌లో సత్తాచాటిన విశాఖ స్విమ్మర్లు



విజేతలతో కోచ్

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 15: తొమ్మిదవ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్ బాలుర, బాలికల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో విశాఖ స్విమ్మర్లు ఓవరాల్‌రన్నరప్ ట్రోఫీని సాధించారు. కర్నూలులో జరిగిన ఈ టోర్నీలో విశాఖ స్విమ్మర్లు ఫ్రీ స్టైల్, బటర్ ఫ్లై, బ్రెస్ట్ స్ట్రోక్, బ్యాక్ స్ట్రోక్, ఐ.ఎం ఈ వెంట్లలో అద్భుతంగా రాణించి పది స్వర్ణ, 15 రజత, ఆరు కాంస్య పతకాలు, 110 పాయింట్లతో ఓవరాల్ రన్నరప్‌గా నిలిచారు. పతకాలు సాధించిన వారిలో బాలుర విభాగంలో గణేష్ చక్రధర్, జిషితేష్ నాయుడు, ప్రియూష్ నాయుడు, బండి సౌరవ్, తమ్మిరెడ్డి సంజయ్, వీవీఎస్. వైభవ్, బాలికల విభాగంలో నిస్తా పాట్లే, బి.పి.కనకలక్ష్మి, పీతల సరయు, కర్ని అనన్య, అంజలి యాదవ్, చుక్కా హైందవి ఉన్నారు. అలాగే, త్వరలో భువనేశ్వర్‌లో జరిగే జాతీయస్థాయి టోర్నీలో పాల్గొనే ఆంధ్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా స్విమ్మింగ్ సంఘం కార్యదర్శి మోహన్ వెంకటరామ్, ఇతర ప్రతినిధులు స్విమ్మర్లను, కోచ్ శ్రీధర్‌ను అభినందించారు.

ఒత్తిడి లేని బోధన అవసరం

కంచరపాలెం, జూలై 15 : ట్యూషన్ కేంద్రాల నిర్వాహకులతో రెండు రోజుల నుంచి కంచరపాలెం బీఎస్ఆర్ భవనంలో నిర్వహించిన ప్రాంతీయ శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పలువురు నిపుణులు ,స్టేట్ రీసోర్సు పర్సన్ డాక్టరు అనంతలక్ష్మి ఒత్తిడి లేని విధంగా ఆకర్షణీయంగాబోధనపై అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ డా.కె.రమాప్రభ అధ్యక్షతన జరిగినఈ శిబిరంలో వివిధ జిల్లాల ట్యూషన్ కేంద్రాల నిర్వాహకులు, ప్రైవేట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూత్ ఫుల్ ఫ్యామిలీ సినిమా ‘పేకమేడలు’

» హీరో వినోద్ కిషన్



సమావేశంలో హీరో హీరోయిన్లు వినోద్‌కిషన్, అనూష కృష్ణ, తదితరులు

డాబాగార్డెన్స్, జూలై 15: యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా పేకమేడలు సినిమా రూపొందించినట్టు హీరో వినోద్ కిషన్ అన్నారు. క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్ బ్యానర్‌పై నా పేరు శివ ఫేమ్ వినోద్‌కిషన్ హీరోగా, అనూష కృష్ణ హీరోయిన్‌గా నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేష్‌వర్రే పేకమేడలు నిర్మించారు. ఈ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా సోమవారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో సినిమా యూనిట్ విలేకరుల సమావేశం నిర్వహించారు. హీరో వినోద్ కిషన్ మాట్లాడుతూ ఈ నెల 19న చిత్రం విడుదల కానుందన్నారు. మధ్యతరగతి కుటుంబం నేపథ్యంలో సాగుతుందన్నా రు. అన్ని వర్గాలను ఆకట్టుకుంటుందని తెలిపారు. హీరోయిన్ అనూష కృష్ణ మాట్లాడుతూ తనకు తెలుగులో ఇది తొలి సినిమా అన్నారు. దర్శకుడు ఈ చిత్రాన్ని బాగా తెరకెక్కించారన్నారు. నిర్మాత రాకేష్ వర్రె మాట్లాడుతూ మధ్య తరగతి ప్రజలు పడే బాధలు, వారి మధ్య భావోద్వేగాలను తెరకెక్కించామన్నారు.

1912కు ఫోన్ చేస్తే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్

ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్



విశాఖపట్నం, జూలై 15: వ్యవసాయానికి కొత్త విద్యుత్ కనెక్షన్ కావలసిన వారు టోల్‌ఫ్రీ నెంబరు 1912 కు ఫోన్ చేసి సర్వీస్ పొందవచ్చునని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్ల పరిధిలోని వినియోగదారులు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ కోసం 1912కు ఫోన్ చేసి కనెక్షన్ పొందవచ్చునని పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఏపీ ఈపీడీసీఎల్ పరిధిలోని మీసేవా కేంద్రాల, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. కొత్త విద్యుత్ కనెక్షన్ల అప్లికేషన్‌లు అప్‌లోడు చేసేటప్పుడు ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయడం ద్వారా విద్యుత్ కనెక్షన్ పొందే నూతన రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. 1912 నంబరు ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడానికి ఫోన్ చేసే సమయంలో రైతులు తమ ఆధార్ నంబరు, రిజిస్టర్డ్ మొబైల్ నంబరు, పట్టాదారు పాస్‌బుక్ నంబరు, సర్వే నంబరు, వాల్టా సర్టిఫికెట్ నంబరు, కుల ధ్రువీకరణ పత్రం నంబరు తదితర వివరాలు తెలియజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సంస్థ పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

‘మాస్టర్ ప్లాన్ సవరించాలి’

సిరిపురం, జూలై 15: వీఎంఆర్‌డీఏ రూపొందించిన 2041 మాస్టర్‌ప్లాన్ పూర్తిగా లోపభూయిష్టంగా ఉందని జనసేన నేత పీతలమూర్తియాదవ్ అన్నారు. సోమవారం వీఎంఆర్‌డీఏ కమిషనర్ రవీంద్రను పీజీఆర్ఎస్‌లో కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వంలో విశాఖలో చేసిన అతిపెద్ద కుంభకోణాల్లో వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ ఒకటి అన్నారు. ఇది ప్లాన్ కాదని విజయసాయిరెడ్డి మాస్టర్ స్కామ్ విమర్శించారు. ఈ నేపథ్యంలో దీనిని రద్దు చేయాలని కోరారు. ఈ ప్లాన్‌పై 9,300 అభ్యంతరాలు వచ్చాయన్నారు. ఎక్కడాలేని విధంగా 200 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణ ఇందులో ఉందన్నారు. మాజీ ఎంపీ ఎంవీవీకి టీడీఆర్ ఇచ్చేందుకు సిరిపురం రోడ్డు 45 మీటర్లు, దసపల్లా భూములు టీడీఆర్‌లు కోసం 100 అడుగుల రోడ్డు , సన్ రే రిసార్ట్స్ అనుకూలంగా మాస్టర్ ప్లాన్‌లో చేసిన మార్పులను వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా నూతన మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని కోరారు.



వీఎంఆర్‌డీఏ కమిషనర్ రవీంద్రకు ఫిర్యాదు అందజేస్తున్న మూర్తియాదవ్

సమస్యలకు సత్వర పరిష్కారం

» జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి కృష్ణ

జ్ఞానాపురం, జూలై 15: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించాలని జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి కృష్ణ అన్నారు. సోమవారం స్థానిక తనకార్యాలయంలో వినతులు స్వీకరించారు. వీటిలో ఇంజనీరింగ్ విభాగానికి, పట్టణప్రణాళికకు రెండు చొప్పున, యూసీడీకి ఒకటి వచ్చింది. ఈ కార్యక్రమంలో సూపరెండెంట్ టి.ఎస్ఎన్.రాజు, ఈఈలు మృత్యుంరాజు, తారా ప్రసన్న, ఏసీపీ వెంకటరావు, టీపీఓ విజయ్‌కుమార్, వైద్యాధికారి సునీల్ కుమార్, ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఏపీడీలు చిరంజీవి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో వినతుల స్వీకరణ



ఉద్యోగులతో మాట్లాడుతున్న జడ్సీ ఆర్.జి.వి కృష్ణ

సీతమ్మధార: సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రాలను తహసీల్దార్ శ్రీరామమూర్తి స్వీకరించారు. పలువురు విద్యార్థులు ధ్రువపత్రాల కోసం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్స్ , అలాగే, కుల ధ్రువపత్రాల కోసం దరఖాస్తులను ఇచ్చారు. వీటిని పరిశీలించిన అనంతరం ధ్రువపత్రాలను మంజూరు చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇబ్రాహిం పాల్గొన్నారు.



దరఖాస్తులు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీరామమూర్తి

గుప్పుమంటున్న గంజాయి

... 5వ పేజీ తరువాయి

అదుపులోకి తీసుకుని విచారించగా స్నేహితుడు పుట్టినరోజు సందర్భంగా బహుమతిగా ఇచ్చేందుకు తీసుకువస్తున్నట్టు చెప్పడంతో పోలీసులు అవాక్కయ్యారు. ఏయూలోని ఇంజనీరింగ్ కళాశాల హాస్టళ్లలో కొన్నాళ్ల కిందట విద్యార్థుల వద్ద గంజాయి ప్యాకెట్లు, గంజాయి సిగరెట్లు లభ్యమయ్యాయి. ఈనెల 11న అర్ధరాత్రి సమయంలో మద్దిలపాలెంలోని ట్రిబుల్ ఎస్ బార్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఒక ఆటోలో నాలుగు సూట్‌కేసులు, ఐదు బ్యాగుల్లో 200 కిలోల గంజాయి లభ్యమైంది. నిందితుల్లో ఒకరు విద్యార్థి ఉన్నట్టు ప్రచారం జరిగినప్పటికీ పోలీసులు మాత్రం ఖండించారు.

చీకటిపడితే గుబులు

గంజాయి వినియోగం నేపథ్యంలో నగరంలో చీకటిపడితే చాలు ప్రజలు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీధుల్లో చీకటిగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఖాళీగా ఉన్న స్థలాల్లో యువకులు గుంపులుగా చేరి గంజాయిని సేవిస్తున్నారు. ఎంవీపీ కాలనీలోని ఎ.ఎస్.రాజా మైదానం, మద్దిలపాలెం ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానం, వన్‌టౌన్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, బీచ్‌రోడ్డు, ఎగ్జిబిషన్ మైదానం, ఏపీఐఐసీ మైదానం, ఆంధ్రా వైద్య కళాశాల బాయ్స్ హాస్టల్ మైదానం, ముడసర్లోవ పార్కు, బీఆర్‌టీఎస్ రోడ్డు, రైల్వేస్టేషన్ పరిసరాలు, పాతజైలు రోడ్డు వంటి ప్రాంతాలు చీకటిపడితే గంజాయి బ్యాచ్‌లకు కేంద్రాలుగా మారిపోతున్నాయి. దీంతో రాత్రిపూట ఆయా ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగించేవారు భయాందోళన చెందుతున్నారు. ఎవరైనా వచ్చి గొడవకు దిగినాసరే ఎదురు చెప్పే సాహసం కూడా చేయకుండా ఎలాగోలా అక్కడి నుంచి తప్పించుకుని వెళ్లిపోయేందుకు యత్నిస్తున్నారు. రాత్రిపూట ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా బీట్‌లు, పికెట్‌లు ఏర్పాటుచేస్తే గంజాయి గ్యాంగ్‌లకు అడ్డుకట్టపడుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి దీనిపై దృష్టిసారించాలని నగరవాసులు కోరుతున్నారు.

ఉద్యోగాలు పేరుతో...

... 5వ పేజీ తరువాయి

నిర్ణయించారు. దీనికోసం ప్రతిపాదనలు తయారుచేయాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. ఈ మేరకు 25 మంది కార్మికులను తీసుకునే బాధ్యతను మలేరియా అధికారితోపాటు ఆ విభాగంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఉద్యోగికి అప్పగించారు. ఇదే అదనుగా భావించిన సదరు శానిటరీ ఇన్‌స్పెక్టర్ జీవీఎంసీలో ఉద్యోగాలంటూ నిరుద్యోగులు, మహిళలను మభ్యపెట్టాడు. ప్రస్తుతానికి తాత్కాలికమే అయినప్పటికీ తర్వాత ఆప్కోస్‌లో చేరిపోతారని ఆశపెట్టడంతో ఎక్కువ మంది ఆసక్తి చూపారు. అలాంటివారి నుంచి ఉన్నతాధికారులకు ఇవ్వాలని చెప్పి రూ.60 వేలు నుంచి రూ.1.2 లక్షలు వరకూ వసూలు చేసి...కార్మికులకు తీసుకున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయం జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా, వారంతా రోజువారీ కూలీ ప్రాతిపదికన తీసుకున్న వారేనని, సీజన్ అయిపోయిన తర్వాత ఆపేస్తామన్నారు. దీనికోసం తాము డబ్బులు ఇచ్చామంటూ ఎవరూ ఇంతవరకూ తమ దృష్టికి తీసుకురాలేదన్నారు. ఒకవేళ ఎవరైనా డబ్బులు ఇచ్చినా, లేదా మరెవరైనా ఇచ్చినట్టు ఆధారాలు ఉన్నా తమకు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి బాధ్యులైన ఉద్యోగిపై చర్యలు తీసుకుంటామన్నారు.

తవ్వకాలు చేపట్టి వదిలేశారు..

స్మార్ట్ సిటీ అధికారుల నిర్వాకంతో పాట్లు



30వార్డులో అసంపూర్తి అండర్ విద్యుద్దీకరణ పనులు

జగదాంబ కూడలి, జూలై 15: గ్రేటర్ 30 వార్డులో విద్యుత్ అండర్ కేబుల్ పనుల కోసం రోడ్లు తవ్వకా లు చేపట్టి వదిలేయడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఎన్నికల కోడ్‌కు ముందు స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా విద్యుత్ అండర్ కేబుల్ వేసేందుకు టర్నర్ చౌల్ట్రీ మె యిన్ రోడ్డు వైపు పనులు చే పట్టారు. నివాసితుల ఇళ్లకు సంబంధించి అం డర్ గ్రౌండ్ విద్యుత్ కనెక్షన్ల నిమిత్తం ఇరుకు సందులో పనులను జీవీఎంసీ చేపట్టింది. కేబుల్ తవ్వి ఐదారు నెలలవుతున్నా, తిరిగి రోడ్డు మరమ్మతు పను లు చేపట్టలేదు. ఇళ్లలోకి వెళ్లేందుకు నివాసితులు నిత్యం అవస్థలు పడుతున్నారు. అలాగే, భూమిలోనుంచి విద్యుత్ కనెక్షన్ కోసం తవ్విన కేబుల్ సక్రమంగా అమర్చలేదని స్థానికులు ఆం దోళన వ్యక్తం చేస్తున్నారు.రోడ్డు మరమ్మతులు చేపట్టాలని జీవీఎంసీ అధికారులు కోరినా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు.

కలెక్టర్‌ను కలిసిన డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



కలెక్టర్‌ను సన్మానిస్తున్న శ్రీధర్

సిరిపురం, జూలై 15: కలెక్టర్, జీవీ ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్‌ను నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, సత్కరించారు.నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

కేజీహెచ్‌లో సేవలపై గరంగరం

... 5వ పేజీ తరువాయి

పెట్టుకుని రూ.200-300 కోట్లతో భారీగా భవన నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. నిధులు గురించి బెంగ వద్దని, అందుకు అనుగుణమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. కేజీహెచ్ పట్ల ప్రజల్లో మంచి భావన ఉండేదని, అది క్రమంగా తగ్గుతోందని, దాన్ని మళ్లీ పెంచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మంచి రోజులు వచ్చాయని, మంచి నాయకత్వంతో ముందుకు వెళుతున్నామన్నారు.ఆస్పత్రి అవసరాలను చెప్పాలని, వాటిని తీర్చేందుకు కృషిచేస్తామన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు పరిశోధనలు సాగించడం ద్వారా ప్రివెంటివ్ మెథడ్స్‌పై దృష్టిసారించాలని శ్రీభరత్ సూచించారు.కేజీహెచ్‌తో పాటు జిల్లా అంతటా ఫాగింగ్ చేయించడంపై దృష్టిసారించాలని ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు.

ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ కేజీహెచ్‌లో నిపుణులైన వైద్యులు, వందలాది మంది సిబ్బంది ఉన్నప్పటికీ ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన దుస్థితి నిరుపేద రోగులకు ఏర్పడుతోందన్నారు. కేజీహెచ్‌కు రావాలంటే ఇప్పటికీ రోగులు భయపడుతుంటారని, మెరుగైన సేవలు అందవన్న భయం రోగుల్లో ఉందన్నారు. నర్సింగ్ స్టాఫ్ కొరత ఎప్పటి నుంచో వేధిస్తోందని, దీనివల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆస్పత్రి అవసరాలకు తగ్గ సిబ్బంది లేరన్నారు.ప్రతిరోగికి మెరుగైన సేవలు అందించేలా ఆస్పత్రిని తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేయాలని, అవి తీసుకొచ్చే బాధ్యతను తాము తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో రోగులకు సహకారాన్ని అందించేలా హెల్ప్ డెస్కులు ఏర్పాటుచేయాలని విష్ణుకుమార్‌రాజు సూచించారు. రోగుల పట్లతో ప్రేమతో వ్యవహరించాలన్నారు. ఇక్కడకు వస్తే మెరుగైన వైద్య సేవలు అందుతాయన్న భావన ప్రజల్లో కలగాలన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేజీహెచ్‌లో సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యులు కూడా రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు శాయశక్తులా కృషి చేయాలని సూచించారు. వైద్య వృత్తిలో డబ్బు సంపాదించాలన్న ఆలోచన సరికాదని, వ్యాపారులు మాత్రమే డబ్బు సంపాదిస్తారని, ఇందులో సేవాగుణం మాత్రమే ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి సహకారాన్ని అందిస్తాం : మంత్రి సత్యకుమార్

వందేళ్ల చరిత్ర కలిగిన ఏఎంసీ నుంచి వేలాది మంది వైద్యులుగా బయటకు వెళ్లి దేశ, విదేశాల్లో స్థిరపడ్డారని వారంతా ఆస్పత్రి అభివృద్ధికి సహకారాన్ని అందించాలన్నారు. దాతల సహకారంతో విభాగాలకు అవసరమైన పరికరాలు కొనుగోలు చేయాలన్నారు. ప్రజలు ప్రైవేటు ఆస్పత్రుల వైపు చూసే రోజులు పోవాలని, ప్రభుత్వ ఆస్పత్రులు వైపు వచ్చేలా చేయాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. ఆస్పత్రుల్లో మౌలిక వసతులు, సిబ్బంది కొరత, ఇతర సమస్యలపై దృష్టిసారించి పరిష్క రిస్తామన్నారు. ప్రభుత్వం తరఫున ఆస్పత్రి అభివృద్ధికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని స్పష్టంచేశారు. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలకు మ్యాచింగ్ గ్రాంటుకు నిధులను సమీకరిస్తున్నట్టు తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలు చెప్పిన సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రిని ఆస్పత్రి అధికారులు, సిబ్బంది సత్కరించారు. పలువురు సమస్యలపై మంత్రికి వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, టీడీపీ నాయకులు పీలా గోవింద్ సత్యనారాయణ, గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, కేజీహెచ్ ఆర్‌ఎంవో డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ లోకనాథం, డాక్టర్ గోపి, డాక్టర్ గిరినాథ్, డాక్టర్ సుబ్రహ్మణ్యంతోపాటు వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

దుకాణాలతో దందా

... 5వ పేజీ తరువాయి

కొనసాగించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించినా తమ అధికారాన్ని ఉపయోగించి తిరిగి ఏర్పాటుచేసేలా చక్రం తిప్పారు. హెచ్‌బీ కాలనీ, శివాజీపాలెం, ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు వంటి ప్రాంతాల్లో దుకాణాలను తొలగిస్తే వార్డు స్థాయి నేతలే వారిపై తిరగబడడంతో జీవీఎంసీ అధికారులు మిన్నకుండిపోయారు.

దుకాణాలకు టులెట్ బోర్డులు

రోడ్డుపక్కన నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలను ఏర్పాటుచేసుకుని అద్దెకిస్తున్న కొందరు అవి ఖాళీ అయితేటులెట్ అని బోర్డులు వేలాడతీస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. జీవీఎంసీ అధికారులు బోర్డులను చూస్తున్నప్పటికీ కనీసం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ సమీపంలో రోడ్డుపక్కన ఏర్పాటుచేసిన దుకాణాలకు టులెట్ బోర్డులు దర్శనమిస్తున్నాయి.వాహనాల రాకపోలకు ఇబ్బంది కలిగించేలాఉన్న దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

గాజువాకలో హత్య

... 5వ పేజీ తరువాయి

నడుస్తుంది. ఈ నేపథ్యంలో రాము, అశోక్‌లు కలిసి అప్పలనాయుడును హతమార్చారు. సంఘటనా స్థలాన్ని డీసీపీ మోకా సత్తిబాబు, ఏసీపీ టి.త్రినాథ్, సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. కాగా మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. స్థల వివాదమే హత్యకు కారణమని డీసీపీ మోకా సత్తిబాబు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని, నిందితులపై గతంలో స్టేషన్‌లో కేసులు ఉన్నాయని తెలిపారు.

ఏయూ అధికారులు ఉక్కిరిబిక్కిరి

» సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం సమాచారం బయటకు రావడంపై ఆందోళన

» రిజిస్ట్రార్ కార్యాలయానికి నివేదిక

విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో గత నెల 18న సంభవించిన అగ్నిప్రమాదంపై ‘ఆంధ్రజ్యోతి’ ప్రచురించిన కథనం క్యాంపస్‌లో ప్రకంపనలు సృష్టించింది. గుట్టుగా సాగిపోయిందనుకున్న వ్యవహారం వెలుగులోకి రావడంతో పలువురు అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్టు తెలిసింది. ఈ విషయం బయటకు ఎలా వచ్చిందని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలావుండగా ప్రిన్సిపాల్ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో కంప్యూటర్, హార్డ్ డిస్క్, స్కానర్, ఇంటర్నెట్ బాక్స్ రెండు ఏసీలు, సీలింగ్ లైట్లు, ఇన్వర్టర్ పూర్తిగా కాలిపోయినట్టు సోమవారం రిజిస్ట్రార్ కార్యాలయానికి సమాచారం అందింది. దీనిపై ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఉన్న కిశోర్‌బాబు ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది. వర్సిటీలో పీహెచ్‌డీలు, ప్రొఫెసర్‌షిప్‌లపై ఆరోపణలు వస్తుండడంతో అడ్డగోలు నియామకాలకు సంబంధించిన ఆధారాలు బయటపడకూడదనే ఫైళ్లు దగ్ధం చేసేందుకు యత్నించి ఉంటారని, ఆ క్రమంలోనే మంటలు ఎగిసి ప్రమాదం సంభవించి ఉంటుందనే ప్రచారం ఇప్పటికే జరుగుతోంది.



రామావతారంలో జగన్నాథుడు

భీమునిపట్నం, జూలై 15 : పట్టణంలోని ఇంద్రజ్యుమ్న మందిరంలో జరుగుతున్న జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా స్వామివారు సోమవారం రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు రొంపిచర్ల కృష్ణమాచార్యులు స్వామివారికి వేకువజామున ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.సాయంత్రం ఆలయ ప్రధానార్చకుడు రొంపిచర్ల సింగరాచార్యులు ఆధ్యాత్మిక ప్రవచనాలు, రామావతార విశిష్టతను భక్తులకు వివరించారు.

ఘనంగా కనకమాంబ తొలేళ్లు

వెంకోజీపాలెం, జూలై 15 : ఇసుకతోట జాతీయ రహదారి పక్కనున్న కనకమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది. శ్రీసీతారామ సేవా మండలి సంఘం ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులు సమర్పించి, మొక్కులు చెల్లించారు. మంగళవారం అమ్మవారి జాతర జరగనున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు సూరిశెట్టి వెంకటేశ్వరన్ తెలిపారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారి ప్రతిమ ఊరేగింపు ఉంటుందని చెప్పారు. బుధవారం 108 కలశాలతో జలాభిషేకం, పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

భీమిలిలో కుంచమాంబ ఉత్సవం

భీమునిపట్నం : పట్టణంలోని బ్యాంక్ కాలనీ, కీటిన్‌పేట గ్రామాల ఆరాధ్య దేవత కుంచమాంబ తొలేళ్ల ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు తామాడ శ్రీను, ఉపాధ్యక్షుడు యరబాల రవి, కార్యదర్శి వనవాడ శివ, కోశాధికారి పోతల వెంకటరావు, సంయుక్త కోశాధికారి సమ్మిడి మూర్తి ఆధ్వర్యంలో ఈ ఉత్సవం జరిగింది. ఉదయం కీటిన్‌పేట, బ్యాంక్ కాలనీ పరిసర ప్రాంత భక్తులు అమ్మవారికి సారె అందజేశారు.

జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలి : యూటీఎఫ్

పద్మనాభం (రూరల్), జూలై 15 : ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రతినిధి ఉప్పాడ రాము డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జీపీఎస్ గెజిట్‌ను ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రాథమిక పాఠశాలల ఉనికిని దెబ్బతీస్తున్న జీవో నెం 117ను కూడా రద్దు చేయాలన్నారు. అలాగే పాఠశాల విద్యా క్యాలెండర్ ప్రకటించాలని, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

విద్యుత్ తీగలు చోరీ

పద్మనాభం (రూరల్), జూలై 15 : మండలంలోని బి.తాళ్లవలస, లింగన్నపేట గ్రామాల్లో పంట పొలాల్లో ఉన్న మూడు విద్యుత్ స్తంభాల వైర్లు చోరీకి గురయ్యారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లోని రైతులు సోమవారం ఈ విషయాన్ని ఏఈ దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో కూడా రెడ్డిపల్లి, బాంధేవపురం,విజయరాంపురం, గంధవరం గ్రామాల్లో ఆరు ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగలను దొంగలించారని రైతులు చెప్పారు. తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖాధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సినిమా గైడ్

● **భారతీయుడు-2:** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి),

● **కల్కి:** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, శ్రీ నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 37,టమాటా 48, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 26, పచ్చిమిర్చి 70, కాకరకాయలు 40, బీరకాయలు 30, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 42, క్యాబేజ్ 32, క్యారేట్ 30, దొండకాయలు 30, బంగాళా దుంపలు 32, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 120, అల్లం (పాతది) 140, బరబటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 50, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 100, పొటల్స్ 40, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 36, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	90
ఫారం ధర	--	110
విత్ స్కిన్	--	190
స్కిన్‌లెస్	--	200

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 1లో..

భీమిలి ప్రజలకు రుణ పడి ఉంటా

- నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

కొమ్మాది, జూలై 15 : భీమిలి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్ది, ప్రజల రుణం తీర్చుకుంటానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. రూ. 50 లక్షలతో ఆధునికీకరించిన జీవీఎంసీ జోన్-2 కార్యాలయాన్ని సోమవారం ఆయన పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో తాను ఎక్కడ కనిపించినా భీమిలి ప్రజలు తమ నియోజవర్గానికి రావాలని అడిగేవారని, వారు తనపై నమ్మకాన్ని ఓట్ల రూపంలో చూపించి రాష్ట్రంలోనే రెండవ అత్యధిక మెజారిటీ ఇచ్చారని తెలిపారు. నియోజకవర్గంలో 2014 నుంచి 2019 వరకు తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తుందని గత ఐదేళ్లలో వైసీపీ ఒక్క పని కూడా చేయలేదని విమర్శించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన నెల రోజుల్లోనే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని, తమ ప్రభుత్వం అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని చెప్పారు. ఆగస్టు 15 నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభిచనున్నట్టు చెప్పారు. విశాఖ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని, అందులో భాగంగా మధురవాడను కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న జోన్-2 కార్యాలయానికి కొత్తగా మరో భవనం నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీ శైలజావల్లీ, కార్పొరేటర్లు మొల్లి హేమలత,పిళ్లా మంగమ్మ, మొల్లి లక్ష్మణరావు, దాసరి శ్రీనివాస్, గొరె గురునాథ్, వాండ్రాసి అప్పలరాజు, పిళ్లా వెంకట్రావు, ఎస్ఎన్ నాయుడు, పోతిన రఘు, గొలగాని సన్యాసిరావు, మన్యాల సొంబాబు, పిళ్లా నరసింగరావు, సోడిపల్లి నారాయణరావు, బోయి శ్రీను, బోయి రమాదేవి, రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులపై అధికారులతో చర్చిస్తున్న ఏడీసీ విశ్వనాథన్

బీఆర్‌టీఎస్ పనులు త్వరగా పూర్తి చేయండి

- జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్

సింహాచలం, జూలై 15 : సింహగిరి ప్రదక్షిణ పురస్కరించుకుని పాత గోశాల కూడలి నుంచి పాత అడివివరం వరకు జరుగుతున్న బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ఆయన జోన్-8 కమిషనర్ హైమావతి, ప్రాజెక్టు ఇంజినీర్లతో కలిసి అడివివరం నుంచి గోశాల వరకు జరుగుతున్న బీఆర్‌టీఎస్ పనులను పరిశీలించారు. స్థానిక గ్రామీణ ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న అప్రోచ్ రోడ్డును కూడా పరిశీలించి స్థానికుల రాకపోకలకు అనుకూలంగా ఉండేలా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఉత్సవం సందర్భంగా పారిశుధ్య నిర్వహణ, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమివ్వాలని చెప్పారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, జూలై 15 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా సోమవారం నిత్య కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు నిర్వహిం చారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

వైసీపీ నాయకుల అరాచకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పద్మనాభం, జూలై 15 : మండలంలోని రేవిడి గ్రామంలో వైసీపీ నాయకుల అరాచకాలపై కలెక్టర్, నగర పోలీసు కమిషనర్‌కు బాధితులు సోమవారం ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలకు రైతుల నుంచి సేకరించిన భూములకు ప్రభుత్వం చెల్లించిన రూ. 84 లక్షలను తమ వద్ద మోసం చేసి కోన రమణ, మజ్జి శంకరరావు దోచుకున్నారని తెలిపారు. అలాగే రెడ్డివాని కల్లాలులో ప్రభుత్వ భూములకు పట్టాలు చేయించుకొని అమ్మకానికి పెట్టారని చెప్పారు. అక్రమాలపై ప్రశ్నించినందుకు మాజీ సైనికుడినైన తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారని రిటైర్డు ఆర్మీ ఉద్యోగి ఎం. ఆదినారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమాలు, నేరాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలని వినతి

ఆనందపురం, జూలై 15 : మండలంలోని కణమాం పంచాయతీలో అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆ గ్రామానికి చెందిన చందవరపు ప్రకాశ్ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సోమవా రం ఆయన కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. సర్వే నెంబరు 50లో వేసిన జగనన్న కాలనీ లేఅవుట్‌కు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో గ్రామానికి చెందిన కొంతమంది 25 సెంట్లు ఆక్రమించి ఎటువంటి అనుమతి లేకుండా భవనాన్ని నిర్మిస్తున్నారని చెప్పారు. ఈవిషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నాలుగో విడత చందనం అరగదీతకు శ్రీకారం

సింహాచలం, జూలై 15 : వరాహలక్ష్మీనృసింహస్వామికి పైపూతగా సమర్పించే నాల్గవ విడత చందనం అరగదీతకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఏటా నాలుగు విడతల్లో స్వామివారికి పన్నెండు మణుగుల (500 కిలోలు) చందనపు ముద్దను సమర్పించడం ఆనవాయితీ. నాల్గవ చందన సమర్పణ ఈనెల 21న తెల్లవారుజామున సుప్రభాత సేవ అనంతరం సమర్పించనున్నారు. ఈమేరకు స్వామివారి సన్నిధిలో ఆలయ నాల్గవ తరగతి సిబ్బంది తొలిరోజ 28 కిలోల చందనాన్ని అరగదీయగా, స్థానాచార్యులు రాజగోపాల్ తూనిక వేసి భద్రపరిచారు.

శిలాఫలకం ఏర్పాటుపై అభ్యంతరం

వెంకోజీపాలెం, జూలై 15 : ఏయూలోని డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయంలో గత శనివారం ఎవరూ లేని సమయంలో శిలాఫలకం ఏర్పాటు చేయడాన్ని ఏయూ పరిరక్షణ సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తుందని సమితి అధ్యక్షుడు డాక్టర్ ఎం. సురేష్ మీనన్ అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏయూ సోదిగంగాలో పది వేలు పీహెచ్‌డీ అప్లోడ్ చేసినందుకు గాను వారు ఈ శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. అందులో మాజీ వీసీ ప్రసాదరెడ్డి, మాజీ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ పేర్లు ఉండడంతో తక్షణమే శిలాఫలకాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు.

'అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోండి'

ఎంవీపీ కాలనీ, జూలై 15 : వాల్తేరు వార్డు బ్లాక్ నెం. 9, సర్వే నెంబరు 75/3,4 పార్ట్ 75, సిరిపురం మెయిన్ రోడ్డు కైలాసమెట్టలోని కాన్వేషన్ బాపిస్టు చెర్చెస్ ఆఫ్ నార్తన్ సిరికార్స్ 18,390 గజాల స్థలంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాల కోసం నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపారని 22 వార్డు కార్పొరేటరు పీతల మూర్తి యాదవ్ తెలిపారు. సోమవారం గనులు, భూగర్భ జల శాఖ డెప్యూటీ డైరక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనుమతి తీసుకున్న దానికి మించి అక్రమంగా తవ్వకాలు జరిగినట్టు నిర్ధారణ జరిగిందని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీలోకి సామాజిక కార్యకర్త మహ్మద్ గౌస్

పెదవాల్తేరు, జూలై 15 : సామాజిక కార్యకర్త మహ్మద్ గౌస్ కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ శాఖా మంత్రి భూపతిరాజు శ్రీని వాస వర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి వై. సత్యకుమార్ సమక్షంలో సోమవారం బీజేపీలో చేరారు. ఆయ నకు లాసన్స్‌బే కాలనీలో ఉన్న పార్టీ కార్యాలయంలో మంత్రులు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, బీజేపీ విశాఖ పార్ల మెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌పీఎస్ఆర్ఎస్ సభ్యుడిగా ప్రకాశరావు ఎన్నిక

సిరిపురం, జూలై 15 : ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీ ఆఫ్ సదరన్ రీజియన్ కౌన్సిల్ సభ్యుడిగా నగరానికి చెందిన నరవ ప్రకాశరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 14,15 తేదీల్లో బెంగళూరులోని బాన శంకర్ సుచరిత ఫిల్మ్ అకాడమీ ఆవరణలో ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీ ఆఫ్ సదరన్ రీజియన్ సమావేశాలు జరిగాయి.ఈ సందర్భంగా దక్షిణాది రాష్ట్రాల ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం వచ్చే మూడేళ్లలో నిర్వహించనున్న ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణ, తదితర అంశాలపై చర్చించారు.

తగరపువలసలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

తగరపువలస, .జూలై 15 : తగరపువలసలోని క్రీడా మైదానంలో సోమవారం బ్యాంకర్ల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో 12 జట్లు పాల్గొన్నాయి. పోటీలో పంజాబ్ నేషనల్ బ్యాంకు జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో ఈ జట్టు యూనియన్ బ్యాంకు జట్టుపై గెలుపొందింది.

సంప్రదాయబద్ధంగా స్వాతి నక్షత్ర హవనం



హోమం చేస్తున్న రుత్విక్‌లు

సింహాచలం, జూలై 15 : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో సోమవారం స్వాతి నక్షత్ర హవనం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున ప్రభాతారాధనల తరువాత యజ్ఞ భగవానుడు సుదర్శనుడ్ని పల్లకిలో తీసుకువెళ్లి కల్యాణ మండపంలో ముందుగా సిద్ధం చేసిన వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్ర నామాలతో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యుల సారథ్యంలో అర్చకులు సంకల్పించి, నృసింహ అష్టోత్తర శతనామార్చన జరిపారు. తరువాత మండపారాధన,కలశారాధన, బింబారాధనచేసి హోమ కుండంలో అగ్నిప్రతిష్టాపనం చేశారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో పంచసూక్తాలతో, నృసింహ, సుదర్శన మూల మంత్రాలతో గంటన్నరపాటు హవనం జరిపారు. అనంతరం ప్రధాన కలశాన్ని అర్చకస్వామి శిరస్సున దాల్చి బేడా మండప ప్రదక్షిణ తరువాత అంతరాలయంలో స్వామి చెంత ఉంచి పూజలు చేశారు.

ఘనంగా దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి


వెంకోజీపాలెం, జూలై 15 : ఏయూలో డాక్టర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ సెంటర్ ఫర్ విమెన్ కేంద్రంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిషోర్‌బాబు, తదితరులు దుర్గాబాయి దేశ్‌ముఖ్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

బయో కెమిస్ట్రీ విభాగంలో సదస్సు

వెంకోజీపాలెం, జూలై 15 : ఏయూ బయో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో టీఎల్ఎన్ సభా మందిరంలో 'ట్రెండ్స్ ఇన్ ఎమర్జింగ్ నానో బయో టెక్నాలజీ - కరెంట్ అప్లికేషన్స్ అండ్ ఫ్యూచర్ ప్రోస్పెక్ట్' అన్న అంశంపై సోమవారం జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు, నేవల్ సిస్టమ్స్-మెటీరియల్స్ డీఆర్‌డీఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై. శ్రీనివాసరావు సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం నానో బయో టెక్నాలజీ రంగం గురించి వివరించారు.

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం తగదు

వాడీవేడిగా పద్మనాభం మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం, జూలై 15 : తాగునీటి సరఫరాలో చోటుచేసుకుంటున్న ఇబ్బందులపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాంబాబు అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామీణ నీటి సరఫరా శాఖపై సమీక్ష జరుగుతుండగా గంధవరంలో మంచినీటి పైపులైన్లు సక్రమంగా లేక ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై గత సమావేశాల్లో చెప్పినా పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ సభ్యుడు రమణరాజు, సర్పంచ్ వర్మ విమర్శించారు. బొత్సపేటలో ఐదేళ్ల క్రితం నిర్మించిన మంచినీటి పథకం నేటికీ వినియోగంలోకి తీసుకురాలేదని ఎంపీటీసీ సభ్యుడు పైడినాయుడు తెలిపారు.గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులకు గోతులు తవ్వి అసంపూర్తిగా వదిలేశారని సభ్యులందరూ అసహనం వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీపీ స్పందిస్తూ సభ్యులు చెప్పిన సమస్యలను పరిష్కరించకపోతే ఎలాగని ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జలజీవన్ మిషన్ పనులపై చాలా ఆరోపణలు ఉన్నాయని, ఈసమస్యపై చర్చించడానికి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, కాంట్రాక్టర్లతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ శైలజను ఆదేశించారు. రెడ్డిపల్లి రోడ్డు విస్తరణలో తొలగించిన మంచినీటి పైపులైనును నేటికీ పునరుద్ధరించలేదని ఉప సర్పంచ్ ఆదిబాబు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ శాఖపై సమీక్ష సందర్భంగా విద్యుత్ లైను స్తంభాలు వేయడానికి పంచాయతీని రూ. 4 లక్షలు చెల్లించమని చెబుతున్నారని తమ పంచాయతీకి అంత స్తోమత లేదని సర్పంచ్ రమణ చెప్పారు. దీనిపై ఎంపీడీఓ స్పందిస్తూ విద్యుత్‌లైనుకు అంత మొత్తం ఎందుకని ట్రాన్స్‌కో ఏఈని అడగ్గా అతను సమాధానం చెప్పలేకపోయారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖలపై సమీక్ష నిర్వహించారు. రేవిడి పీహెచ్‌సీకి నూతన భవనం మంజూరయ్యిందని, స్థలం కేటాయించాలని అధికారులు సభ్యులకు తెలిపారు. రెడ్డిపల్లిలో బాలికల వసతి గృహంలో 54 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఎవరు వచ్చినా సీటు కల్పిస్తామన్నారు. వచ్చే ఏడాదికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రారంభానికి జిల్లా అధికారులు నిర్ణయించారని బీసీ సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ రాజేశ్వరి, పంచాయతీ విస్తరణాధికారి కుమార్, ఏఓ రాధ, పలు శాఖల అధికారులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో ఉచిత శిక్షణ

విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు గృహిణి స్పోకెన్ ఇంగ్లీష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాప కుడు దామోదర మనోహర్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రామా టాకీస్ సమీపంలో కెనరా బ్యాంకు ఎదురుగా ఉన్న సంస్థ కార్యాలయంలో ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 17 వరకు శిక్షణ ఉంటుందన్నారు.ప్రతిరోజూ ఉదయం 10 నుంచి 11.30 వరకు తరగతులు జరుగుతాయని, శిక్షణకు ఎటువంటి ఫీజు అవసరం లేదని చెప్పారు. ఆసక్తి గల వారు 80193 88999 ఫోన్ నంబర్‌ను సంప్రతించాలని ఆయన సూచించారు.

కోస్టల్ జోనింగ్ ప్లాన్‌పై అభ్యంతరాల స్వీకరణ

భీమునిపట్నం, జూలై 15 : కోస్టల్ జోనింగ్ ప్లాన్‌ను కొత్త రూపకల్పనలో భాగంగా ఈనెల 27వ తేదీలోగా అభ్యంతరాలు స్వీకరించనున్నామని పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2019లో రూపొందించిన ఈ ప్లాన్‌ను మళ్లీ కొత్త సవరణలతో ముసాయిదా రూపొందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత ఏపీ పర్యావరణ శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, అటవీ శాఖ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ సంయుక్తంగా చర్చించి ప్లాన్‌ను రూపొందిస్తారని చెప్పారు.జోన్ పరిధిలోని ప్రజలకు ఎటువంటి అభ్యంతరాలున్నా ఉన్నతాధికారులకు తెలియజేయవచ్చన్నారు.

వారాహి అమ్మవారి దీక్షలు విరమణ

తగరపువలస, జూలై 15 : జీవీఎంసీ రెండో వార్డు పరిధి కీటిన్‌పేట శ్రీవిద్యా శక్తి పీఠంలో పది రోజులుగా జరుగుతున్న వారాహి గుప్త నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ముగిసాయి. ఈనెల 6న ఆషాడ శుద్ధ పాడ్యమి నుంచి పీఠం వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ సోమయాజుల కల్యాణ చక్రవర్తి శర్మ ఆధ్వర్యంలో భక్తులు దీక్షలు చేపట్టి, ఆచరించారు. ప్రతిరోజూ ఉదయం, రాత్రి ప్రత్యేక ద్రవ్యాలతో హోమాలు జరిపారు. చివరి రోజు దీక్షా విరమణ, మహా పూర్ణాహుతి అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి : జనసేన

భీమునిపట్నం, జూలై 15 : జీవీఎంసీ రెండో వార్డులో ఉన్న చిల్లపేట, జీరుపేట, రెల్లివీధి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని జనసేన నాయకులు కోరారు. సోమవారం వారు పట్టణంలోని జోనల్ కార్యాలయంలో కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాలని కోరారు. జనసేన వార్డు అధ్యక్షుడు నీలాపు శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు చిన్న, రాజు, నరసింగ్ పాల్గొన్నారు. కాగా జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మూడు వినతులు అందించినట్టు సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. యూసీడీ విభాగానికి రెండు, ఇంజనీరింగ్ విభాగానికి ఒక ఫిర్యాదు వచ్చిందన్నారు.

నేడు మద్దిలో ముత్యాలమ్మ తల్లి పండగ

పద్మనాభం (రూరల్), జూలై 15 : మద్దిలో మంగళవారం ముత్యాలమ్మ తల్లి పండగ జరగనుంది. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు, తెల్లవారుజామున ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు. అభిషేకాలు జరుగుతాయని, సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని కమిటీ సభ్యులు చెప్పారు.

సాగర్‌నగర్‌లో చిల్లర దొంగతనాలు

సాగర్‌నగర్, జూలై 15 : సాగర్‌నగర్ దసపల్లా లేఅవుట్ ప్రాంతంలో వారం రోజులుగా చిల్లర దొంగతనాలు జరుగుతున్నాయి. వాహనాల నుంచి పెట్రోల్, డీజిల్ తీసేయడంతో పాటు బోరు బావుల నుంచి విద్యుత్ వైర్లు కత్తిరించుకుపోతున్నారు. ఇటీవల ఎంబజీ బ్లాక్‌లో రెండు ఇళ్ల వద్ద ఇదే తరహా చోరీలు జరిగాయి. తాజాగా దసపల్లా లేఅవుట్‌లో ఓ పార్లర్ వద్ద ఉన్న బోరుబావి విద్యుత్ వైరును కత్తిరించుకువెళ్లిపోయారు. గంజాయి, మద్యానికి బానిసైన వారే ఇటువంటి పనులకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

ఓపెన్ డ్రింకింగ్‌పై తనిఖీలు

ఆరిలోవ, జూలై 15 : ఆరిలోవ పరిసర ప్రాంతాల్లో ఇటీవల పలు సంఘటనలు చోటుచేసుకోవడంతో సీపీ ఆదేశాల మేరకు పోలీసులు ఓపెన్ డ్రింకింగ్‌పై తనిఖీలు చేపడుతున్నారు. మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవించి విచ్చలవిడిగా నేరాలకు పాల్పడుతుండడంతో ఆదివారం రాత్రి నుంచి 15 మంది ప్రత్యేక పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. తొలిరోజు రోడ్డుపై విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్న 30 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసినట్టు సీఐ గోవిందరావు తెలిపారు. పగటి పూట పది మంది, రాత్రి పూట 15 మంది పోలీసులు సమస్యాత్మక ప్రాంతాల్లో గస్తీ చేపడుతున్నట్టు ఆయన చెప్పారు.

సచివాలయాల్లో సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు

తగరపువలస, జూలై 15 : జీవీఎంసీ రెండో వార్డుకు చెందిన టీడీపీ నాయకులు గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలను బహూకరించారు. వార్డు పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువుల షెడ్ల నిర్మాణానికి 'ఉపాధి' అనుసంధానం

పద్మనాభం (రూరల్), జూలై 15 : రైతుల కష్టాలను గుర్తించిన కూటమి ప్రభుత్వం పశువుల షెడ్ల నిర్మాణానికి ఉపాధి పథకాన్ని అనుసంధానం చేయడం హర్షనీయమని మాజీ ఎంపీపీ కాళ్ల పద్మ, నగేష్‌కుమార్ అన్నారు. సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం ఆలోచన చేస్తుందన్నారు.